UNIVERSAL LIBRARY
OU_204086
UNIVERSAL LIBRARY

# భారతవీరులు

గ్రంథకర్త:

వింజమూరి వెంకట లక్ష్మీనరసింహారావుగారు.

పబ్లిషర్సు:

వేంకట్రామ అండ్ కో.,

సికింద్రాబాదు (దక్కన్.)

1940

కాపీరైటు రిజిష్టర్డు ]

[ వెల 0—6

CHECKED. 1951

# విషయసూచిక

CHECKED 1956


1. భీష్ముఁడు.

2. ద్రోణుఁడు.

3. అశ్వత్థామ.

4. కర్ణుఁడు.

5. దుర్యోధనుఁడు.

6. శ్రీకృష్ణుఁడు.

7. ధర్మరాజు.

8. భీముఁడు

9. అర్జునుఁడు.

10. అభిమన్యుఁడు.


Checked 1

# భారతవీరులు.

## 1. భీష్ముఁడు.

### జననము

కురువంశాధీశ్వరుండగు శంతనుండొకనాఁడు మృగయా వినోదంబునందగిలి నిజపరివారముతో భాగీరథీప్రాంతంబునం దిరుగాడుచుండెను. అనేక క్రూరమృగంబులం దునుమాడుచు నతఁడు విహరించుచుండ, నాఁడు శ్రీరాముని మోసపుచ్చుటకై యేతెంచిన బంగరులేఁడివంటి లేఁడియొకటి, తళ తళ మెఱయఁ జంగు చంగునఁ జౌకళించుచు, మనోహరములైన చంచల దృక్కుల నిటునటుఁ జూచుచు, నడుమ నడుమ లేఁబచ్చిక జొంపములను మేయుచు స్వేచ్ఛావిహారము సల్పుచు శంతనునకు లోచనగోచర మయ్యెను. అతండా లేఁడిని బట్టఁ గుతూహలుండై దానివెంట నొంటరియై తఱుముఁజొచ్చెను. అది యెంతకుంబట్టువడక యాతనిని దవుదవ్వులం గొనిపోయెను. ఎంతకా మృగంబు చిక్కమికి రాజు చింతిల్లుచు గమనాయాస మపనయించుకొనఁ గోరి, నిర్ఘోషగీతికలచే స్వాగతమిచ్చుచు. శీతలపవమాన పరంపరలచే వింజామరలు వీఁచుచు నుత్తుంగ తరంగకరములచే నాహ్వానించుచున్న గంగాకచ్ఛమునకుం బోయి, యందొక సికతాతలంబుపైఁ గూరుచుండెను. చల్లని పిల్లదెమ్మెర

లతని మేనిని సోఁక నతఁడు కడు హాయిని జెంది తన పరివారముమాటయే మఱచి సుఖించుచుండెను.

అప్పుడొక తొయ్యలి, భూమి కవతరించిన రతీదేవతవలె నున్న రూపవతి, యప్పుడప్పుడే గంగాస్నానముం గావించి కురు లారవిప్పుకొని తిరుగాడుదానింబోలె నెఱికురులు విరియఁబోసికొని సుందర మందగమనముతో శంతనున కెదుట సంచరించుచుండెను. అతఁడామె సోయగమున కచ్చెరువొంది నిశ్చేష్టుఁడై యామెవంక తదేకదృష్టితోఁ జూచుచుండెను. ఆమెయు ముసి ముసి నగవులు నగుచు నెడనెడ మహారాజుం జూచుచు విహారము సల్పుచుండెను. శంతనుఁ డామెను వివాహ మాడఁగోరి, యామెనుడగ్గరి, "ఇంతీ! నీవెవ్వరి చిన్నదానవు? నీ సౌందర్యము నన్నాకర్షించినది. నేను గురుదేశాధీశ్వరుండను. నా చెలిమి నీవంగీకరింతువేని, న న్నుద్వాహ మాడుటకు నంగీకరించి నాకానందము గూర్పుము. నీకు రాజ్ఞీగౌరవము లన్నియు సమకూర్చుటయేగాక, నీ కోరికలన్నియు దీర్తును" అని వచించెను.

అందున కా తరుణి, "మహారాజా! నే నెవ్వరిదాననైన నీకేమి? నన్ను గంగయని పిలుతురు. నాలావణ్యము నిన్నాకర్షించి నాకుసమ్మతియున్న నీవునన్నుఁ బెండ్లియాడనిచ్చగించు నపుడు, నా కులగోత్రాదులతో నీకుఁ బనిలేదుగదా! నీవు నామాట కెదురాడక నే నేపనినిఁ జేయఁబూనినను వలదనక

నన్ను గౌరవింతువేని, నేను నీ కర్ధాంగినైయుండుట కభ్యంత రము లేదు. నేను నీయెడ నీతిఁదప్పి చరింపననియు నెఱుంగుము. నీవు నాకడ్డము చెప్పిన యుత్తరక్షణమున నిన్నుఁ బాసిపోవుదును" అని జవాబు చెప్పెను.

ఆమెయందుఁగల మోహముచే శంతనుఁ డా పద్ధతుల కన్నిటి కంగీకరించి, యమితోత్సాహముతో నామెను తీసికొని నిజపరివార మున్న చోటికిఁ బోయి, యచ్చటినుండి యతి శీఘ్రకాలములోనే హస్తినాపురముం జేరెను. అందొక శుభ ముహూర్తమున గంగాశంతనులకు మహావైభవముతోఁ బరిణయ మయ్యెను. ఆ జాయాపతులు చంద్రికయుఁ జంద్రుఁడును వలె గలసిమెలసి సుఖముగాఁ గాఁపురము చేయుచుండిరి.

కొన్నాళ్లకు వారికొక చక్కనికుమారుఁడుదయించెను. శంతనుఁడు మిగుల నానందమందెను. కాని గంగ యా బిడ్డ నెత్తుకొని చని గంగలోఁ బాఱవైచెను. అదేలయని భార్య నడిగిన, సమయభంగమై తన్నుఁ బాసిపోవునేమో యని భయపడి శంతనుఁ డూరకుండెను. కాని మదిలో నెంతో దుఃఖించెను.

ఇట్టులామె యేఁటేఁట నొక్కొకపుత్రునివంతున నేడుగుఱు కొడుకులంగని గంగపాల్టఁ బెట్టుచుండెను. రాజీ ఘోర కృత్యములఁ జూచియుఁ దన్నామె యెక్కడ వీడిపోవునోయను భయంబునఁ గిమ్మనకుండెను. ఆమె ఎనిమిదవ చూలు దాల్చెను. మఱల నొక సుందరాంగునిం గనెను. వాని

నొడిలో వైచుకొని యెప్పటియట్ల గంగయొద్దనకుం బోవుచుండెను. శంతనుండిక భరింపజాలక, ఓసీ! రాకాసీ! ఇదెట్టి క్రూరపద్ధతియే! మారాకారులగు కన్నకుమారుల నిట్లు చంపుకొను తల్లులెందైనం గలరే? కొడుకులమారీ! ఇంక నే భరియింపజాల. ఈ బిడ్డనిం జంపవల" దని పలికెను.

గంగ దరహాసముతో నిలిచి "రాజా! నీవు కోరినట్లు నీ సుతుని జంపకుందును. కాని, నేటితో నీకును నాకును నేస్తము సరి. నే నీలోకమునకు వచ్చినపని పూర్తియైనది. ఇంక నేంబోయెద"ననెను. శంతనుండుకలంతపడి, "అమ్మయ్యో! నీవు నన్ను విడిచిన, నేనొక్క నిముసమైన మనంగలనా? నా యవాచ్యదోషములు మన్నింపుము. నీయిచ్చవచ్చినటులే చేయు" మని యామెం బ్రార్థించెను.

గంగ, "అయ్యా! మన మిరువురము బ్రహ్మచే శపింపంబడి మర్త్యలోకమునం బుట్టితిమి. నా శాపకాల మైపోయినది. నేనింక బోకతప్పదు. నేను గంగాదేవిని. నీవు మహాభిషుండను గంధర్వుండవు. నీ శాపకాల మింకను ముగియలేదు. అది ముగిసినప్పుడు నీవుగూడ నీలోకము వీడి చనెదవు" అని మాఱుపలికెను.

శంతనుండు, "నీవు గంగాదేవివైన నీవకారణంబ యామేద్దుఱు నిసుంగుల నేలచంపితివి? వారేమి యెగ్గు గావించిరి?" అని యడిగెను. గంగ, "అష్టవసువులు వసిష్ఠున కెగ్గుచేసియుండ, నాతండా యెనమండ్రను భూలోకమునందు జనింప శపించెను.

వారిలో మొదటి యేడుగురికి వెంటనే శాపవిమోచనమును, నెనిమిదవవానికిఁ జిరకాల మీ భువిని యశోవిరాజితమైన జీవనమును వసిష్ఠుఁడు శాసించెను. అక్కారణమున వారు నాయందు జనించి వెంట వెంటనే శాపమోక్షముం గాంచిచనిరి. ఈ యష్టమపుత్రుఁడు విద్యాబుద్ధులు నేర్చుదాఁక నాయొద్దనే యుండును. ఇతఁడు నీ కులంబునకేగాక భారతభూమి కంతకును యశంబుఁదెచ్చు మహాపురుషుఁడగును. నాకు సెల విమ్ము" అనుచు గొడుకుతోఁ గంగ యంతర్ధానమందెను.

## యౌవరాజ్యాభిషేకము

గంగ తన పుత్రునకు దేవవ్రతుఁడని పేరుపెట్టి, మిగుల గారాబముతోఁ బెంచుచు, నైదవయేట నక్షరాభ్యాసముఁ జేయించి, వసిష్ఠ విశ్వామిత్రులయొద్ద సమస్త శాస్త్రములును, బరశురామునికడ విలువిద్యయు నేర్పించెను. ఒకనాఁడా బాలుఁడు శరసంధానమునందుఁ దన హస్తలాఘవము మెఱయ గంగాతీరమున గూర్చుండి వినోదించుచుండెను. అత్తఱి శంతనుఁడు వేటకై యయ్యెడ కేగుదెంచెను. అప్పుడా బాలకుఁడు శరపరంపరలచే గంగాప్రవాహము నరికట్టుచుండెను. శంతనుఁడా బాలకు బాణవిద్యానైపుణ్యమున కాశ్చర్యపడి వానిందగ్గఱి "బాలకా! నీ వెవ్వరి పిల్లవాఁడవు? ఇంత పిన్నవయసున నీకిట్టి విలువిద్దె యెట్టులభించె" నని యడిగెను. ఆ బాలుఁడు తాను గంగాపుత్రుఁడననియుఁ బరశురామశిష్యుఁడననియుఁ జెప్పి యూరక

కుండెను. శంతనుఁ డా ప్రత్యుత్తరములతోఁ దనివి సనక "నీతండ్రి యెవ్వఁ" డని యడుగునప్పటికి గంగాదేవి ప్రత్యక్షమై "రాజా! ఈతఁడు నాకు నీవలనఁ గలిగిన కొడుకు. వీఁడు దేవప్రసాదముచే లోకమునకు మేలుగూర్ప నాకు జనించినవాఁ డగుటచే దేవవ్రతుఁడని పేరు పెట్టితిని. ఈతని భావిచరిత్ర సమస్తలోకస్తోత్రపాత్రమై యుండును. వీని నింక నీవు కొనిపోయి నీరాజ్యమునకు యువరాజుగాఁ జేకొను" మని పలుకుచు నంతర్హిత యయ్యెను.

శంతనుం డాశ్చర్యానందములం జెంది యా నందనుని స్వీకరించి తనయరదంబుపైఁ గూర్చుండబెట్టి హస్తినాపురమునకుఁ దీసికొనిపోయి, వృద్ధామాత్య పురోహితానుమతిని నొకనాఁడు వానికి మంగళస్నానములం జేయించి, చీనిచీనాంబరాభరణభూషితుం జేసి గురుదేశమునకు యువరాజుగాఁ బట్టాభిషేకంబు గావించి విశేషోత్సవముం జేయించెను. దేశజను లాబాలగోపాల మాబాలునిఁ జూచి యానందమందిరి.

## బ్రహ్మచర్యదీక్ష

దేవవ్రతుని యౌవరాజ్యాభిషేకమైనతర్వాత నాలుగేండ్లు గడచెను. అంత నొకనాఁడు శంతనుఁడు నిజపరివారముతో యమునానదీప్రాంతవనంబులకు వేఁటకై పోయెను. అతఁ డొక క్రూరసత్వముం దఱుముకొని పోవుచుండ నతని ఘ్రాణేంద్రియమునకు మనోహరంబగు పరిమళ మొండు గోచ

రంబయ్యెను. అది యపూర్వమై తోఁప రాజా సువాసన దేనికిం గలదో యరయఁగోరి యెక్కడిదే పరిమళంపుగాలి వీతెంచిన జాడనుబట్టి ముందునకు నడువ నారంభించెను. కొంతదూరము పోవఁ బోవ నొక కాలువలో నొకయోడ నడుపుచున్న యొక కన్నియ యప్సరసంబోలునది యతనికిఁ గాన్పించెను. అతఁడామె సౌందర్యాతిశయంబున కచ్చెరు వొంది యామె మేనిసుగంధమున కానందమొంది, "చానా! నీవెవ్వరిదానవు? అలోకలావణ్య రూపవతివగు నీవేకతం బున నేకతంబ యోడ నడపుచుంటివి? నీకీ యపూర్వ సౌరభమెట్లు సిద్ధించెను? చెప్పు" మని యడిగెను.

ఆమె "ఆర్యా! నేను జాలరికులంబునకు రాజగు దాశ రాజు కూఁతును. నన్ను సత్యవతియని పిలతురు. నే నీ యోడ నడుపుపని నాతండ్రి యాజ్ఞపై కేవల ధర్మార్థము చేయు చుంటిని. నా మేనికీ పరిమళము మున్నొకపరిఁ బరాశరుఁడను మహాముని యనుగ్రహముచేఁ గల్గినది" యని వినయమున నుత్తర మిచ్చెను.

రాజామె పలుకుల కలరి "కోమలీ నీవు కన్యవగుదు వేని, నిన్నుం బరిణయమై నిన్ను నా దేవేరినిగాఁ జేకొనఁ గుతూహలపడుచుంటి" ననెను. అందుకు కాకన్య "అయ్యా! నేను గన్యనే, కాని నన్నొరునకిచ్చు నధికారము నాతండ్రికే కలదు. కావున నాతనినే యడుగుఁ" డని బదులుపల్కెను.

శంతనుఁడు దాశరాజుకడ కరిగి తన్నెఱింగించుకొని తనయభిలాషముం దెల్పెను. జాలరిఱేఁడు శంతనుని కోర్కెఁ

దీర్పనెంచి యిట్టులనియె. "మహారాజా! తమబోంట్లు మాబిడ్డ నుద్వాహ మాడ నెంచుటచే మేము మిగుల నదృష్ట వంతులము. నేనొక్క కోరికంగోరుదును. దానిందీర్పఁ దా మంగీకరింతు రేని నాబిడ్డను తమ కానందపూర్వకముగానిచ్చి పెండ్లియొనర్తును. అదేదనఁ దమయనంతరమున నాకూఁతు బిడ్డలే తమరాజ్యముం బొందవలయు ననునది." ఈ పలుకులు విని రాజించుక ఖిన్నుఁడై "దాశరాజా! నీకోర్కెఁ దీర్ప నేను సమర్థుండనుగాను. నా ప్రథమభార్యవలన మహా పరాక్రమశాలియు, ధీశాలియు, సుగుణశాలియునగు దేవ వ్రతుఁడను కుమారుఁ డొకఁడు కల్గియున్నాఁడు. అతని కింతకుమున్నె యువరాజ్యపదవియొసంగి యున్నాను. అట్టిచో నా రాజ్యము మఱల నీ కూఁతుసంతాన మెట్లు పొందఁగలదు? ఆ కోరికనుమాని వేఱొండు కోరుము. తప్పక తీర్తు" నని చెప్పెను.

దాశరాజుతనకదితప్పమఱియొకకోర్కె లేదని చెప్పెను. శంతనుండేమి మాఱు పల్కుటకుం దోఁపక చింతాక్రాంతచిత్తుఁ డగుచు నిజరాష్ట్రమున కేగెను. పురంబు చేరినది మొదలా మహారాజు సత్యవతీచింతనంబు తప్ప మఱియొండు చేయ నొల్లక, రాచకర్జము లన్నియు విడిచి యేకాంతమందిరమున నేదో తలపోయుచుండెను. దేవవ్రతుఁడది కనిపెట్టి తండ్రి కడకుం జని ఖేదకారణమేదియని యడిగెను. అందునకు రాజిట్లనియె. "నాయనా! ఏకసంతానము గలవాఁడు సంతానము లేనివానితోఁ దుల్యుఁడని పెద్దలందురు. నీవు మహా

పరాక్రమశాలివగుటచే నాహవ క్రీడలం దగిలి యుందువు. సాహసకార్యముల కొడిఁగట్టు నీవు నామువ్వఁ గడతేర్తు వని యెట్లు నమ్మఁగలను? నేనొక కన్యను గ్రమ్మఱ వివాహ మాడి సంతానముం బడయ నిచ్ఛగించుచున్నాను."

దేవవ్రతుఁడావలఁదండ్రిమనంబుదాశరాజుకూఁతుపై దవిలియుంటయు, నతడేఁమి కారణముననో కన్యనియ్య నొల్ల కుంటయు, నమాత్యులవలనఁ దెలిసికొని, యుచిత పరి వారముతో దాశరాజుకడకుంబోయి "అయ్యా! నీ కూఁతుపై నా జనకుని డెందము నిల్చియున్నదని వింటిని. అతని కామెం గూర్చి మోదమును సమకూర్పఁ గోరుచున్నా" ననెను. దాశరాజు శంతనునికడఁ దెల్పిన తన కోర్కెను మఱలఁ దెలియఁ జేసెను. అందునకు దేవవ్రతుఁడు మిగుల సంతసించి, యెట్లులైన నానందముం గూర్చుటయే నందనుని ధర్మమని యెఱింగినవాఁడగుటచే దాను రాజ్యపరిత్యాగముం జేయ నిశ్చయించుకొని, యచ్చటంగూడిన వారివంకఁదిరిగి "అయ్యలారా! వినుఁడు. నాజనకహితార్థము సమయ మొనర్చు చుంటిని. ఈ లతాంగికి నా తండ్రివలనఁ గలుగనున్న తన యుఁడే కురురాజ్యమున కర్హుఁడు. మాకందఱకుఁ బతి వాఁడే. కౌరవకులస్థితికారుఁడు వాఁడే"యని గంభీరోక్తులం బలికెను.

సభ్యులెల్ల రా ప్రతిజ్ఞ కాశ్చర్యపడిరి. దాశరాజు మిగుల సంతసించెను. అతని పితృభక్తిని మిగులఁ గొని యాడెను. కాని యంతటితోఁ దృప్తినొందక వెండియు నిట్లు

నెను. "అయ్యా! నీవు ధర్మ మెఱింగినవాఁడవు. కావున నిట్లు రాజ్యత్యాగముం జేసితివి. కాని నీసంతానమందులకు సమ్మతించి యామర్యాద నిలుపునా" యని యడిగెను. అందుమీఁద దేవవ్రతునకు మఱియుఁ బితృభక్తి యావే శింప సంభ్రమముగా నిట్లని యుద్ఘోషించెను. "సభ్యులారా! మఱల వినుఁడు. పితృప్రయోజనార్థ మేమి కావలయునన్న దాని నొసంగ సంసిద్ధుఁడనై యున్న నేను త్రికరణశుద్ధిగఁ బల్కునుడువుల నాలకింపుఁడు. నేను నేఁటినుండి బ్రహ్మచర్య దీక్షఁబూని యుందును. నాసంతతివలన సత్యవతిసంతతి కెట్టి యెగ్గును కలుగకుండుట కట్టి నిశ్చయబుద్ధి నేను వహించి యున్నాను. అనపత్యత వలన నాకుఁ గలుఁగబోవు పున్నామ నరకము నాకుఁ గలుగకుండుఁగాత యని పరమేశ్వరుం బ్రార్థింతును."

ఈ వాక్యములకు దేవలోకమున దుందుభులు మ్రోగెను. సురలు పుష్పవర్షముం గురిసిరి. దేవవ్రతుఁ డప్పటి నుండియు భీష్ముఁడను పేరంబరఁగుచుఁ జిరస్థాయి యా కీర్తిని పరిపాలించి భారతదేశమున కలంకారభూతుఁ డయ్యెను.

పిమ్మట భీష్ముఁడు సత్యవతినిఁగొని తనపురికేఁగి తండ్రికి మహావైభవముతోఁ బెండ్లిచేసెను. శంతనుఁడు తనయెడఁ బుత్రుఁడు చూపిన యపారగురుభక్తికలరి యతనికి స్వచ్ఛందమరణము గలుగునట్లు వరంబిచ్చి సత్యవతిం గూడి యత్యంత సంతోష సుఖంబు లందుచుండెను.

## గురుతిరస్కారము

ఆవల శంతనునకు సత్యవతివలనఁ జిత్రాంగద విచిత్రవీర్యులను నిద్దఱు కుమారులుపుట్టిరి. వారింకను జిన్నతనంబున నుండఁగనే శంతనున కీలోకము వీడిరమ్మని పరమేశ్వరాహ్వాన మందుటచే నతఁడు పరలోకగతుఁ డయ్యెను. భీష్ముఁడు తండ్రి కుత్తరక్రియలఁ జేసి చిత్రాంగదునికిఁ బట్టముఁగట్టెను. కాని యతఁడు దుర్వ్యసనలోలుఁడై యుండుటయే కాక గర్వాతిరేకమున నొక గంధర్వునితోఁ బోరి ప్రాణములఁ గోల్పోయెను. పిమ్మట భీష్ముఁడు విచిత్రవీర్యునికి రాజ్యాభిషేకముఁ గావించి తాను సమస్త విధములఁ దమ్ముని కంగరక్షకుఁడై విలసిల్లుచుండెను.

విచిత్రవీర్యునకు వివాహయోగ్యకాలము రాఁగా, భీష్ముఁడతనికిం దగినకన్య నన్వేషించు చుండెను. అత్తఱిఁ గాశిరాజు తన మువ్వురు తనయలకు స్వయంవరముఁ జాటించెను. భీష్ముఁడు సమస్తవాహినీసమేతుఁడై అచ్చటి కేఁగి స్వయంవరమునిమిత్తము కూడిన రాజులనెల్ల జయించి యా కన్నెలంగొని రాక్షసవిధిని దన తమ్మునికి బెండ్లిచేయు నుద్దేశముతో హస్తినాపురమునకుఁ దీసికొని వచ్చెను. ఆ బాలికలు అంబ, అంబిక, అంబాలిక యను వారలు. వారిలో నంబ తానింతకుమున్నె సౌంభపురేశ్వరుండగు సాళ్వుని వరించియుంటి ననియుఁ బరాధీన చిత్తయగు తన్ను బలాత్కరించి విచిత్రవీర్యునకుఁ బెండ్లిసలుపఁ

బూనుట యధర్మమనియుఁ జెప్పెను. ఆమె నుడులు ధర్మ యుక్తము లగుటచే భీష్ముఁడామెను విడిచిపుచ్చెను. తక్కుం గల ఇరువురు కన్యలను విచిత్రవీర్యునకుం గూర్చి మహా వైభవముతోఁ బరిణయ మాచరించెను.

అంబ తిన్నఁగా సాళ్వరాజుకడ కరిగి తన యకల్మష ప్రేమందెలుపుచుఁ దన కన్యాత్వం బేమియుఁ జెడలేదనియు వక్కాణించెను. కాని సాళ్వుఁ డామె నుడులు నమ్మక పరునిచేఁ గొనిపోఁబడిన నిన్నుఁ గైకొననొల్లనని త్రోసి పుచ్చెను. తన కింకేదారియు లేకపోవుటచే మఱల నంబ భీష్మునియొద్దకే వచ్చి తన్నుఁ జెలియండ్రతోఁ బాటు విచిత్ర వీర్యునకే కూర్పుమని వేఁడెను. కాని భీష్ముఁడు "పరాయత్త చిత్తవగు నీ వొరుని యిల్లాలివి. దాన నీ కన్యాత్వము చెడినది. నీవు మా తమ్మునికిఁ బనికిరావు. పో" మ్మని నిరాక రించెను. అంబ భీష్ము నెన్ని విధముల బ్రతిమాలినను లాభము లేకపోయెను. తుదకామె "పరశురాముఁడు భీష్ముని గురువుగదా! అతఁడు చీవాట్లు పెట్టిన నాతఁడు తిన్నని దారిలోనికి వచ్చునేమో" యని యూహించి యప్పరశు రాముని సన్నిధికేగెను. పరశురాముఁ డామె యుదంత మంతయు విని యామెయం దే తప్పును లేదని నిశ్చయించి తన ప్రియశిష్యుఁడగు భీష్మునిం బిలిపించి యతనితో నంబ నెట్టులేని విచిత్రవీర్యునికిం బెండిలి సేయుమనియు, లేకున్న నతని కొక యింతిమనువుఁ జెడఁగొట్టినవాఁడ వగుదువనియుఁ జెప్పెను. ఎవరెన్ని చెప్పినను భీష్మునికి నచ్చకుండెను. అతఁడు

తన హృదయవాణి ధర్మమనిచెప్పినదానిం గూర్చి యితరు లెంతపూజ్యులైన సరే, యేమిచెప్పినను విననొల్లని స్వభావము గలవాఁడగుటచేత, జామదగ్ని ప్రయత్న మంతయు వమ్మయ్యెను.

అంత పరశురామునికి భీష్మునిపైఁ గోపమువచ్చి "ఓరీ! నీవు గురువులమగు మమ్మే యధిక్షేపించుచు ధిక్కరించుచున్నావే! నీపాటి ధర్మములు మే మెఱుఁగమా! నీవునాయాజ్ఞ నెఱవేర్పవేని నిన్ను నా పరశుఘాతములచే నొప్పించి యొప్పింతు" ననెను. భీష్ముఁడు మాఱుమాటాడక గురునితో బోరాటమునకు డీకొనెను. ఉభయులును గవచాదులను దాల్చి రథారోహణంబు లొనర్చి ప్రోత్సాహులై సమర క్రీడ కుపక్రమించిరి. భీష్ముఁడు గురుపాదములకు నమస్కార బాణములంపి యావలఁ దనకాఁ గురుసత్తముఁడు నేర్పిన యస్త్రవిద్యా విశేషమంతయు వెలిబుచ్చుచు సంగర మొనరించెను. ఆ యోధవరు లిరువు రిరువదిరెండు దినంబులు ఘోరంబుగాఁ బోరిరి. ఒకరి కొకరు తీసిపోవకుండిరి. ఇరువురును బడలిరి. కాని పట్టుదల వీడకుండిరి. పగటివేళ యుద్ధ మొనర్చుటయు రేయి విశ్రాంతి నొందుటయుఁ గావించుచుండిరి. ఇరువదిరెండవనాటిరాత్రి భీష్మునికి నిద్దురపట్టలేదు. తాను ధర్మయుద్ధము సలుపునప్పుడు జయమేల కలుగకుండవలయునని యూహించుచు దేవతలను దనకు విజయముం గూర్పఁ బ్రార్థించుచుఁ గన్నుమూసెను. అంత నిద్దురలో వసువులు వచ్చి యతనికి మోహనాస్త్ర మొసంగి దానిచేఁ బరశురాముఁడు నిహతుఁడగునని చెప్పి మాయమైరి.

ఉభయులు కాల్యంబులం దీర్చి నూతన్నోత్సాహములతో నొండొరులు నెదుర్కొనిరి. పరశురాముఁడు బ్రహ్మాస్త్రముం బ్రయోగించెను. భీష్ముఁడు మఱల నింకొక బ్రహ్మాస్త్రమేసెను. లోకమంతయు జ్యోతిర్మయ మయ్యెను. ఆవల భీష్ముఁడు మోహనాస్త్రంబుం బ్రయోగింప నుంకించుచుండ నారదుఁడు ప్రత్యక్షమై యతనిని వారించెను. భీష్ముఁడూరకున్నను బరశురాముఁడు విజృంభించుచునేయుండెను. అప్పుడు జమదగ్నియు, జాహ్నవియు వచ్చి వారివారి సుతుల రణోత్సాహమును మాన్పియిరువురకు సంధిఁజేసిరి. రేణుకానందనుఁడు గాంగేయుని బలపరాక్రమములకును, భక్తివిశేషములకును మెచ్చుకొనెను. అతఁడుశిష్యునిందీవించి యంబతో "నే నిఁక చేయునది లేదు. నీకొఱకు నా శిష్యునితోఁ బోరాడియు నోడితిని. నీదారి నీవు చూచుకొను" మనెను. అంబ "సరే. నేను జన్మాంతరమందైన భీష్మునిం జంపితీరెద" నని వచించి తపస్సాచరింపఁ బోయెను.

ఎవ్వరి యాశ్రమములకు వారేఁగిరి. భీష్ముఁడు హస్తినాపురముం జేరి తమ్మునితో సుఖముగా నుండెను.

## సమయపాలనము

విచిత్రవీర్యుఁ డంబాలికయం దతిలోలుఁడై నానాఁట శుష్కించి యకాలమరణమందెను. భీష్ముఁ డాతనికిఁ బరలోకక్రియలుచేసి పుత్రశోకముచే మిగులఁదపించు సత్యవతిని,

భర్తృవియోగముచేఁ గుందు నాఱడంద్రను నూఱడించి, యరాజకంబైన రాజ్యంబును జక్కఁగఁ బాలించుచుండెను.

"ఇట్లుండ నొకనాఁడు సత్యవతి భీష్మునిం బిలిచి, కుమారా! కురువంశవృక్షమునకుఁ బుట్టిన మొలకలలో నీవొక్కఁడవ యుంటివి. రాజ్యమేలుటకును బితృదేవతలకుఁ దర్పణము లిడుటకును నీ వొక్కరుఁడవే మిగిలియుంటివి. నీయందైన సంతానము నిలిచినంగాని నీతో నీవంశ మంత రించును. కావున నాకోర్కెఁ జెల్లించి నీవు వివాహమాడి కులవిస్తారుఁడవుఁ గమ్ము. వంశవిచ్ఛేద మగునప్పుడు నీవు ప్రతిజ్ఞ తప్పినను దోషము కాదని నా యూహ" యని పల్కెను.

భీష్ముఁడు "అమ్మా! నీవట్లానతీయఁదగునా? చంద్రుఁడు చల్లఁదనమును సూర్యుఁడు తేజమును, అగ్ని వేఁడిమియు విడిచిన విడుచుఁగాక, నేనుమాత్రము చేసిన ప్రతిజ్ఞను దప్పఁ జాలను. అయినను గురువంశ మంతరించుటయన నాకును కష్టముగానే యున్నది. నాకొక్క యుపాయము తోఁచు చున్నది. అది యుచితంబగునేని, దాని నాచరించుట మేలు. మున్ను పరశురామునిచే క్షత్రియవంశము లంతరింపనుండ బ్రాహ్మణులవలన క్షత్రియకాంతలు సంతతిం బడయవచ్చు నను నాపద్ధర్మమొండు బయలు వెడలినది. అట్టిది బలియను రా జనపత్యుఁడైనప్పుడుకూడఁ బాటింపఁబడ్డది. కావున నిప్పుడు పరమపవిత్రగుణుఁడగు నొక బ్రాహ్మణోత్తముని

వలన విచిత్రవీర్యు క్షేత్రంబులయందు సంతతిం గల్గించుట మేలని నాకుఁ దోచుచున్నది" అని వచించెను. సత్యవతి యా మాటల కలరి తనకుఁ బరాశరునివలనఁ దొలుత గల్గిన పుత్రకుఁడు వ్యాసభట్టారకు నాహ్వానింతమని చెప్పి యాతని స్మరియించినంతనే యతఁడు ప్రత్యక్షమై తల్లికి వందనం బొనరించి, "అమ్మా! నన్నుం బిలిచిన హేతువెద్ది?" యని యడిగెను. అప్పుడు సత్యవతి, యున్న యుదంతము నెఱుఁగ బల్కి యతని నెఱులైన నంబికాంబాలికలయందు సత్సంతానముం బడయఁగోరెను. అతఁడు జనని యానతిని నంబికయందు ధృతరాష్ట్రుని, నంబాలికయందుఁ బాండు రాజును గాంచెను. భీష్ముఁ డత్యానంద మందెను. అతఁడట్టి విషమ పరీక్షా కాలము వచ్చినతఱిఁగూడఁ దన దృఢ ప్రతిజ్ఞకు భంగము రానీకుండఁ గాపాడుకొనఁ గల్గెను. అతని కీర్తి చిరస్థాయియై భూమిపై నిల్చెను.

## యుద్ధపూర్వవృత్తాంతము

భీష్ముఁ డా యిరువురు బిడ్డలను గడు గారాబమునఁ బెంచుచుండెను. వారికి యుక్తవయస్సు రాఁగా, వారిలో ధృతరాష్ట్రునకు గాంధారియను కన్యను బెండ్లి జేసెను. రెండవవాఁ డగు పాండురాజు స్వయంవరములందుఁ గుంతీ మాద్రులను సతులనుగాఁ గొనెను. ధృతరాష్ట్రుని సింహాసనాధిష్ఠునిం జేసి భీష్ముఁడు కుమారులకు సర్వవిధములఁ దోడ్పడుచుఁ గాలము బుచ్చుచుండెను.

ధృతరాష్ట్రునకు దుర్యోధనాదులైన నూర్గురు పుత్రులును, దుస్సలయను నొక కూఁతును బుట్టిరి. పాండురాజునకు ధర్మరాజు, భీమార్జున, నకుల, సహదేవులనువా రేవురు కుమారులు గల్గిరి. పాండురాజు కాలవశుఁడై మరణించెను. దుర్యోధనాదులు కౌరవులనియు, ధర్మరాజాదులు పాండవులనియుఁ బిలువఁబడు చుండిరి. వారందఱు ధృతరాష్ట్రునాదరముననే పెరుగుచుఁ గృపద్రోణులయొద్ద నస్త్రవిద్య నేర్చుచుండిరి. పాండవులు సద్గుణ సంపన్నులై జనుల కిష్టులై యుండుట దుర్యోధనాదులకుఁ గిట్టకుండెను. చిన్న చిన్న పొరపొరలుగా బయలుదేఱి నానాటఁ దీవ్రవిరోధముల క్రిందఁ బ్రబలెను. అప్పుడు బంధుజనానుమతిని ధృతరాష్ట్రుఁడు రాజ్యములో సగము పాండవుల కిచ్చి కడమ సగము తన కొడుకుల కిచ్చెను.

పాండవులు తమ బాహు విక్రమాదుల చేతను, శ్రీకృష్ణుని ప్రాపుచేతను రాజ్యము విస్తరింపఁ జేసికొనిరి. ధర్మరాజు రాజసూయయాగము గావించి చక్రవర్తి యయ్యెను. వారి సంపద్వైభవములఁ జూచి చూపోపక దుర్యోధనుఁడు తన మేనమామయగు శకుని సహాయమున మాయాద్యూత మొకటి కల్పించి యందు బాండవుల నోడించి వారి రాజ్యసర్వస్వమును గైకొని, ద్రౌపదిని నిండు కొలువున మానభంగము గావించి, పండ్రెండేఁడు లరణ్యవాసమును నొక్క యేఁ డజ్ఞాతవాసమును జేయవలసినదిగా నియమించి పాండవులఁ బాఱఁదోలెను.

భీష్ముఁడు మొదటి నుండియుఁ బాండవుల ధర్మగుణమును, కౌరవుల దుర్ణయచేష్టలను గమనించుచునేయుండెను. పలుసారు లది తగదని సుయోధనుని జీవాట్లు పెట్టెను. కాని యతఁడు వానిని శాసింప సమర్థుఁడు కాకుండుట నేమియుఁ జేయలేకుండెను. "అయ్యో! కలి యిప్పుడే వచ్చెనే! లోకమున ధర్మము శూన్యమయ్యెనే! కురుకులపాంసనులు పాండవుల నిష్కారణంబ బాధించుచున్నందులకు ఫలం బనుభవింపకపో" రని యూరకుండెను.

పాండవు లరణ్యవాసాజ్ఞాతవాస దీక్షలు జయప్రదముగా ముగించి వచ్చి తమ రాజ్యభాగము తమ కీయుమని కోరుచు శ్రీకృష్ణునిదుర్యోధనునికడకు రాయబారిగఁబంపిరి కాని యతఁడు సూదిమోపినయంత నేలయైన నీయనని మాఱుపల్కెను. ఉభయులును సమరసన్నాహము లొనరింప దొరకొనిరి. కౌరవుల పక్షమునఁ బదునొకం డక్షౌహిణులును, బాండవులవైపున నేడక్షౌహిణులును సేనలుకూడెను.

యుద్ధ మారంభించుటకు ముందు దుర్యోధనుఁడు భీష్ముని సర్వసేనాధిపత్యము వహించి తనకు జయమాపాదింపఁగోరెను. భీష్ముఁడిట్లని బదులుపల్కెను. "నాయనా! నాకు మీరును, బాండుసూనులును నొక్కటేూవు. అయినను నేను నీతోనయుంటిగావున నీపక్షముననే నిల్చి యుద్ధమొనరించుట ధర్మము. నీకై నా శక్తినంతయు ధారవోయుదును. కాని యర్జునునితోఁ బోరన్న వెఱతును. అతఁడు నాకన్న

మిన్నయగు జోదు. అతనిం గెల్చువారలుండుట యరిది. అదిగాక, నాపైఁబగఁబూని యంబ ద్రుపదునికిఁ గొడుకై పుట్టి శిఖండినామమున నొప్పుచున్నది. ఆ శిఖండితో నేఁ బోరనొల్లను. ఇంతకును ధర్మము జయించును. కాని నీవును నేనును జేయునది లేదు."

## యుద్ధము

కురుక్షేత్రమున నిరువాఁగులవారును సమరమునకుం డీకొనిరి. భీష్ముఁడుపల్కిన ప్రోత్సాహవాక్యములచేఁ గౌరవ సేనలన్నియు నుత్సాహపూరితములై యుండెను. ధర్మరాజు యుద్ధారంభమున భీష్మునియొద్దకేఁగి యతనికి నమస్కరించి యతనివలన నాశీర్వాదముంబొంది వచ్చెను.

మొదటి తొమ్మిదినంబులును భీష్మునితోడి యుద్ధము పాండవుల కతిభీష్మమై తోఁచెను. పాండవబలము నానాఁట క్షయంబందుచుండెను. "అర్జునా! నిన్ను నమ్ముకొని నేని యుద్ధమునకుఁ గడంగితి. నీవుపేక్షించుచున్నావు. భీముఁడు విక్రమముం జూపుచున్నను రిత్తయగుచున్నది. భీష్మ తిమిం గిలము మన సేనాసముద్రముం జొచ్చి పలుభంగులఁ గలంత పఱుచుట నీవును జూచుచునే యున్నావు. దీనికి నుపాయం బేదేని శ్రీకృష్ణునితో యోజింపవలయు" నని ధర్మజుఁడనెను. అప్పుడర్జునుండు చెలరేగి శౌర్యాగ్నిఁగురియింప నారంభించెను. దానికిఁ గౌరవవాహినులు తహతహ పడఁజొచ్చెను. భీష్ముఁడు పాండవ పక్షపాతియగుటచే బుద్ధిపూర్వకముగా

వారింజంప నూరకున్నాఁడని రారాజు తలంపఁజొచ్చెను. ఒకనాఁటిరేయి భీష్మునితో నాతఁడించుక నిష్ఠురముగా మాటాడెను. అందుమీఁద గాంగేయుఁడు కొంకక పాండవులయందు ధర్మబలమే కాక బాహుబలమును మిక్కుటముగాఁ గలదనుటకు గోగ్రహణాది గత కథాంశములను నిదర్శనముగాఁ జెప్పి యర్జునుం డజేయుఁడనియు నైనను దనశక్తి వంచన లేకుండఁ బోరాడెదననియుం జెప్పి యతని వెలుపును బాపెను.

ఆ మఱునాటియుద్ధము దుర్నిరీక్ష్యమైయుండెను. శాంతనవుఁడు మధ్యాహ్న మార్తాండునివలె వెలింగెను. దానికిఁ బాండుసూనులు తాళఁజాలక యుండిరి. కృష్ణుఁడు కోపమాఁపుకో లేక చక్రమేయఁబోయెను. కాని భీష్మునిమాటలు విని యూరకుండెను. నిశాసమయమున భీష్ముని శిబిరము కడకుఁ బోయి తమకు జయముగల్గు నుపాయం బెఱింగింపుమని పాండవులు వేడిరి. భీష్ముఁడెట్టిదైన ధర్మమునకే జయము కల్గింపఁగోరువాఁడు గావునఁ దాను బాణములు లేనివానితోను, స్త్రీతోను, స్త్రీపూర్వునితోను, స్త్రీనామధారితోను యుద్ధముచేయననియు, నట్టివారిలో నంగనాపూర్వుఁ డొక్కరుఁడు శిఖండి యనువాఁడు పాండవులయందుండుటచే వానిం బురస్కరించుకొని కిరీటి యుద్ధముచేసినఁ దా నస్త్రసన్న్యాసముం జేయుదుననియుఁ జెప్పి వారి యలమటఁదీర్చెను. అర్జునుం డధర్మమార్గమున భీష్ముని

బోలియింపవలసి వచ్చినందులకుఁ జింతనొందుచు ద్రౌపదీ సోదరుని మున్నిడుకొని మఱునటిదినమున యుద్ధ మొనర్చి భీష్మునిం గూల్చెను.

భీష్ముఁడు నేలఁగూలినతోడనే యుభయ పక్షముల వారును సమీపమున కేఁగిరి. అతఁడు విశ్రాంతి నొందుటకు రారాజెన్నియో పఱుపులందెఱఁ బంచెను. కాని వానినెల్ల నతఁడు నిరాకరించి యర్జునుం డమర్చిన యంపశయ్యపైఁ బండుకొని, యతండే యిడిన బాణంపుఁ దలగడఁ దలాపి నుంచుకొని విశ్రాంతి గైకొని యుత్తరాయణ పుణ్యకాలము కొఱకుఁ బ్రాణము లుండఁ బట్టుకొని యుండెను.

ఈలోపల గౌరవులందఱును మడసిరి. పాండవులు సంపూర్ణజయముం గాంచిరి. బంధునాశనముం గావించి నందులకు ధర్మరాజు మిగుల వగచుచు వైరాగ్యవృత్తిఁ బూని యుండఁ గృష్ణుఁడు వానిని గొని శరముల సెజ్జపై బండియున్న గంగానందనుని కడకుఁ బోయెను. అప్పుడా వృద్ధ కౌరవుఁడు వాసుదేవుని ధ్యానించుచు నిర్యాణకాలముకొఱ కెదురు చూచుచుండెను. శ్రీకృష్ణుఁడాతని భక్తికి మెచ్చి తన మహిమచే నతనికి శరబాధ యుడిపి ధర్మరాజునకు రాజనీతి బోధింపవలయునని కోరెను. అప్పు డా మహానుభావుఁడనేక ఇతిహాసములతో రాజధర్మములు, యుద్ధనీతి, వర్ణధర్మములు, ఆశ్రమధర్మములు, యాగము, గురుజనము, సత్యము, కర్మము, పరమాత్మ, ఇంద్రియ నిగ్రహము, కామము

నడవడి, అజ్ఞానము, యోగము, దైవపౌరుషములు, తృష్ణ. దుశ్శీలము, తీర్థసేవ, అసమకన్యాదానము, దానము, అహింస, గ్రహఫలము, సాధులు మున్నగు విషయములం గూర్చి మనోహరఫణితి నుపన్యసించెను.

ఆ మహాత్ముఁడు మాఘశుద్ధమున నేకాదశినాఁడు నిర్యాణముం జెంది పరమేశ్వరునిలో నైక్యమందెను. భారత జనయిత్రిగన్న సత్పుత్రశ్రేణిలో నతం డుత్తమోత్తముం డనవచ్చును.

## 2. ద్రోణుఁడు

ద్రోణుఁడు భరద్వాజుఁడను మునిపుంగవుని పుత్త్రుఁడు. ఇతఁడు పాంచాలదేశాధీశుని కుమారుఁడగు ద్రుపదునితోఁ గలిసి అగ్నిదేవుఁడను నొక గురూత్తమునికడ విద్య నేర్చిరి. ఉభయులును సమస్తశాస్త్ర పారంగతులైరి. ద్రుపదుఁడుతన రాజధానికిఁబోయెను. పోవునప్పుడు ద్రోణునితో "మిత్రుఁడా! నేను రాజ్యారూఢుండనైనప్పుడు నీవు నాకడకువచ్చి సమ్మాన మొందు" మని చెప్పెను. అతని తండ్రియైన పృషతుని మరణా నంతరము ద్రుపదుఁడు పాంచాలమునకు రాజయ్యెను. ద్రోణుఁడు జనకు నింటనే యుండెను.

కొన్నాళ్ళకు ద్రోణుఁడు కృపియనుదానిని పెండ్లి యాడెను. ఆ దంపతులకు నశ్వత్థాముఁడను కొడుకు పుట్టెను.

కాని యాబిడ్డకుఁ జాలినన్ని పాలు తల్లికడ లేకుండెను. ద్రోణుఁడు కడు బీదవాఁడగుటచేత నొక గోవునైనఁ గొనఁ జాలకుండెను. ధనము లేని కొఱంత యాతనికిప్పుడు మిక్కుటముఁగా గోఁపనారంభించెను. ఎటులేని బిడ్డను సంరక్షించు భారమును తనమీఁదనుండుటచే నతఁడు పరశురాముఁడున్న చోటికి వెళ్ళి యతనిం దర్శించి "భార్గవా! నేను భరద్వాజుని సుతుఁడను. సర్వశాస్త్రములం జదివితిని. విద్యాధనము నెంతేని గడించితిని. కాని స్వర్ణధనమేమియు లేనివాఁడ నగుటచేఁ గన్నబిడ్డను పోషించుకొనఁ జాలకుంటిని. నీవు పలువురు రాజులం జయించి వారి రాజ్యములను స్వాధీనపఱచుకొనిన మహాభాగ్యశాలివి. దారిద్ర్యము బాపి, నాకును నా సతీసుతులకును సుఖజీవనోపాయము గూర్పవా?" యని యర్థించెను. జామదగ్న్యుఁడు ద్రోణుని దీనస్థితికి మిగులవగచి "కుమారా! నీచరిత్రమువినఁ గడుజాలి వొడముచున్నది. కాని నేను జేయునది కాన్పింపకున్నది. ఏలయన, నేను గొల్లఁగొన్న ధనమంతయు మున్నే విప్రులకు బంచిపెట్టితిని. నే నలవఱచుకొన్న భూమియంతయుఁ గశ్యపునకు ధారవోసితిని. నాకడనిప్పుడు చిన్ననాటనుండియు నన్నడబాయకున్న యస్త్రశస్త్రములుమాత్రమే యున్నవి. వానిని నీవు కోరుదువేని తప్పక యొసంగెద" నని మారుపల్కెను. ద్రోణుఁడాతని కరుణకు సంతసించి యతనివలన నమూల్యాస్త్రశస్త్రములం గొని దీవనలఁబడసి యింటికి వచ్చెను.

ద్రోణున కీ యస్త్రసంపాదనమువలన లేమితొలంగ కుండెను. అతని కెద్దిచేయుటకుం బాలుపోక యుండెను. అప్పుడు తన బాల్యసహపాఠియగు పార్షదునిమాటలు జ్ఞప్తికి వచ్చెను. అతఁడిప్పుడు సింహాసనారూఢుఁడై పాంచాలదేశము నేలుచుండెననివినెను. చిన్ననాఁడంత గలసి మెలసి యున్న మిత్రుఁడు తానర్థించిన యర్థములన్నియు నిచ్చి తన్నుఁ దనుపునని ద్రోణుఁడునమ్మి యొకశుభదినముననిలువెడలి పాంచాలదేశమున ముఖ్యపట్టణమగు కాంపిల్య నగరమును గతిపయదినములలోఁ జేరెను. అంత రాజు మంత్రిముఖ్యనియోగిజనముతోఁగూడి నిండోలగం బున్నతఱిని ద్రోణుఁడు సభాప్రవేశముం జేసి ద్రుపదునికిఁ దన్నెఱింగించు కొనెను. ద్రుపదుఁడు రాజ్యమదాంధుఁడై బాల్యస్నేహితుని మఱచి యతని కర్హ్వాగతిని స్వాగత మీయకుండెను. బాల్యమిత్రుఁడని కాకపోయిన మానె, నొక బ్రాహ్మణోత్తముండని యైన నాతని నాదరింపక యాతఁడొనర్చిన మనవియంతయు విని "నీవు నా సహపాఠివా? నీవంటి దరిద్రులతో నాకు స్నేహముండునా! నీవిట్టి కల్పనకథతో వచ్చి నన్నర్థింపక నీయథార్థస్థితిం దెలిపి యేదేని కోరుదువేని మాకుఁదోఁచినది నీకిచ్చియుందుము. అనృతవాదివి గావున, నీకేమియు నీయబడదు. కావున వెంటనే నాసభవిడిచిపొమ్ము. పోనందువేని నాబంట్లచే గెంటింతు" నని పలికెను.

ద్రోణుఁడు "రాజా! ఇంత మైమఱపా? నీవును, నేనును, జిన్ననాఁ డగ్నిదేవుని శిష్యులముగామా! నన్ను విస్మరించినను, గురునింగూడ మఱతువా!" అని యడిగెను.

ద్రుపదుఁడు, "ఓయీ! నీవు నోటికివచ్చినట్లుమాటాడు చుంటివి. బీదవానికి ధనికునితోను, జ్ఞానరహితునికి సుజ్ఞానితోను, భీరునికి వీరునితోను, లోభికి వదాన్యునితోను, కులటకు సాధ్వితోను సఖ్య మెచ్చటనైన సంభవించునా? నీవును నేనును స్నేహితులమనిన, నెవ్వరేని నమ్మెదురా ? ఇఁక నీ యధిక ప్రసంగము కట్టిపెట్టి యావలకుంబొమ్ము" అనెను.

ద్రోణుఁడు. "రాజా! నీమాటలు వింత గొల్పుచున్నవి. నీతండ్రియు నాతండ్రియు బద్ధసఖ్యులగుటచేతనే కదా నిన్నునాతోఁగూడి చదువఁబంపెను. అదియెల్ల మఱచితివా! కానిమ్ము. ఇప్పుడు నీయనాదరణమువలన నాకే లోపమును లేదు. సద్బ్రాహ్మణ తిరస్కారముం జేసిన రాజెవ్వండును బాగుపడలేదు. నేనే యుత్తమ బ్రాహ్మణుఁడనైన, నిన్ను నాపాదాక్రాంతునిఁ జేయకుందునా!" అని చివాలున లేచి కొలువుఁగూటమును విడిచిపోయెను.

ప్రకృతమునఁ దన్నుఁ బీడించుచున్న దారిద్ర్యమును బోఁగొట్టుకొనుట యెట్లనియుఁ దనకిప్పుడుదయించిన పరాభవ జనితక్రోధము నుపశమింపఁ జేసికొనుట యెట్లనియు నతఁడూహింపనాగెను. తనభార్య సోదరుఁడు కృపుఁడు కురురాజులయొద్ద నున్నాఁడనువిషయ మాతనిజ్ఞప్తికి వచ్చి, యాతని మూలమునఁ గౌరవుల నాశ్రయించుటయే సర్వవిధముల లగ్గని నిశ్చయించుకొని హస్తినాపురముంగూర్చి ప్రయాణమయ్యెను. అట్లు పయనమైయాతఁడు నిత్యప్రయా

ణములచేఁ గొలఁదికాలముననే హస్తినాపురముం జేరుకొనఁ గల్గెను.

అతఁడూరిబయటికివచ్చునప్పటికిఁ బాండవకౌరవకుమారులు బంతి యాడుకొనుచుండుట యతని కన్నుల బడియెను. వారి క్రీడావినోదముం జూచుచు నతఁడచ్చట నించుకసేపాఁగి యుండ, నయ్యెడ వారికందుక మొక పాడునూతఁబడియెను. దానిని బయటికిఁ దీయువెరవుఁగానక యాకుమారులుకలఁత పడుచుండిరి. అప్పుడు ద్రోణుఁడు వారిండాసి "రాజకుమారులారా! మీరందఱు విల్లమ్ముల ధరించి యుండియు బంతి నీవలకుం దీసికొననేరకున్నారా! మీ యస్త్రవిద్యాగురువు నేర్పినవిద్య యింత మాత్రపు బనికైన నుపకరింపలేక పోయెనా?" యని యడిగెను. వారు తెల్లపోయి "విప్రోత్తమా! మేమింకను నస్త్రవిద్యలోఁ గుశలులము కాము. నీవావిద్య నేర్తువేని, మాయందు దయయుంచి, యాకందుకముం దీసి యి" మ్మని కోరిరి. ద్రోణుఁడొక రాజపుత్త్రుని విల్లును నమ్ములను బుచ్చుకొని హస్తలాఘవము మీఱ బాణ పరంపరంబఱపి యా కందుకముంవేసి యా బాలుర కిచ్చెను. వారతని లాఘవమున కచ్చెరువొంది, యతనికిని దమగురువగు కృపునకును గల్గు బాంధవ్య మతనివలన నెఱింగి, యతనిని దమతో రాచనగరునకు రమ్మని ప్రార్థించి, కొనిపోయి భీష్మునికొప్పగించిరి భీష్ముఁడును ద్రోణుని మిగుల గౌరవించి యతనికిఁ గుమారుల కెల్లరకు విలువిద్దియ నేర్పుట యందుఁ బ్రధానాచార్యత్వ మొసంగెను. అతఁ

డిటుల తన కోరికలో నొకటియగు లేమినుండి విడుపుంగాంచి కృతార్థుఁడయ్యెను. ఇఁక ద్రుపదుఁ డొనర్చిన పరిభవము బాపుకొను టొక్కటియే మిగిలి యున్నది.

ద్రోణుని కృపవలనఁ గౌరవపాండవులు శస్త్రాస్త్ర విద్యలందుఁ బరిపూర్ణులైరి. వారిలో నర్జునుని యేకాగ్ర బుద్ధికిని, హస్తలాఘవ విశేషమునకును ద్రోణుండు మిగుల ముదితుండై యతని కెల్లరకంటె నెక్కువ విద్దియను నేర్పి తనయంత వానింజేసెను. విద్య ముగిసినది కావున గురునకుఁ దగిన దక్షిణ లీయఁదలఁచి కుమారులు ద్రోణునిసమీపించి "గురూత్తమా! మీ కేమి బహుమానము కావలయును? మీరు కోరినది తెచ్చియిచ్చెద"మని పలికిరి.

"నేఁగోరినదే మీరిత్తురేని వచించెద వినుఁడు. నేను మున్నొకపరి పాంచాలాధీశునిచే నన్యాయముగాఁ బరాభవింప బడితిని. మీరు నన్ను సంతోషపెట్టఁ దలఁతురేని వానింగట్టి నాపాదాక్రాంతునిఁ జేయుఁడు. అదియే నాకు వేయి బహుమానములు." అని ద్రోణుఁడు బదులు చెప్పెను.

తొలుతఁ గౌరవులే గురుభక్తిని వెల్లడింపగోరి యతని పనుపుసేయఁ గుతూహల పడుటచే, వారినే కాంపిల్య నగరముపై దండువిడియ ద్రోణుఁడాజ్ఞయిచ్చెను. వారట్లు లేగి ద్రుపదునితోఁ బోరాడి యతనిని జయింపలేక పరాభూతులై మఱలి వచ్చిరి. పిమ్మట నర్జునుఁడొక్కఁడ యక్కార్యము నిర్వహించుకొని వత్తునని నుడివి, సముచితపరివారముతోఁ

గాంపిల్యనగరమునకుం బోయి ద్రుపదు నోడించి గురుఁడు గోరినట్లు వానిని గట్టి తెచ్చి యతని కాళ్ళపై బడవైచెను. అప్పుడు ద్రోణాచార్యునికిఁ గల్గిన యానందము వర్ణింపఁ దరముకాదు. అతఁడు సగర్వముగా ద్రుపదునివంకఁ దిరిగి పరిహాసముగా నిట్టులనెను. "ఓహో! వీరలెవరు? పాంచాల మహారాజుగారా! స్వామీ! యిదేల, నావంటి దరిద్రునిపాద ములపయింబడితిరి? తమబోఁటి యాగర్భశ్రీమంతులు మా యట్టి గర్భదరిద్రులకడకు వచ్చుట మున్నెన్నఁడును లేదే! నేఁడేల యీవైపరీత్యము?" ద్రుపదుఁడు చేయునదేమియు లేక లోలోనఁ గుములుచు మిన్నకుండెను. ఆవల ద్రోణుఁడు "ఓరీ! నృపాధమా! ఐశ్వర్యమదంబునఁ గన్నులుగానక నేను జిన్ననాటి నేస్తకాఁడననుట మఱచితివిగా? ఇప్పుడేని నేనెవఁడనో స్మృతికి వచ్చినదా? బ్రాహ్మణోత్తముల నెప్పుడును బరాభవింపకుము. బుద్ధిగలిగి మసలుము. నీతండ్రి మా తండ్రికి హితుఁడగుటచే నిన్నుఁజంపక ప్రాణములతో విడుచుచున్నాను. పో" మ్మని నిందించి వానికట్లను విప్ప నర్జునని కాజ్ఞయిచ్చెను. అర్జునుఁ డట్టులొనర్ప ద్రుపదుఁడు క్రోధాగ్ని లోననడంచుకొని నిజపురంబున కరిగి దీర్ఘతపో నిష్ఠంబూని బరమేష్ఠిని సాక్షాత్కరింపఁ జేసికొని ద్రోణుం జంపఁగల పుత్రునొక్కని, నర్జునుని బెండ్లియాడు పుత్రిక నొక్కతెను బ్రసాదింపుమని కోరి యీప్సితార్థసిద్ధిఁ గాంచెను.

ఏకలవ్యుఁడను బోయవాఁ డొకఁడు ద్రోణునియొద్ద ధనుర్వేద మభ్యసింపఁ గాంక్షించెను. కాని ద్రోణుఁడు శూద్రునకు వేదవిద్య నేర్పనిచ్చగింపక యేకలవ్యుని కోర్కె నిరాకరించెను. అంత నాశబరుఁడు ద్రోణుని విగ్రహ మొకటి మంటితోఁ జేసి యావిగ్రహమే తనగురువని భావించి యస్త్ర విద్య నభ్యసించుచు నందు విశేష ప్రావీణ్యమును సంపాదించెను.

వాఁడట్లు లరణ్యములో బాణవిద్యాభ్యసన మొనర్చుచుండఁ గురుపాండవులు ద్రోణునితోఁ దత్కిరాతుఁడున్న యరణ్యప్రాంత సీమకు వేఁట కేతెంచిరి. అప్పుడొక వేఁటకుక్క పాండవులు వేఁటాడుతావుఁ దప్పి యేకలవ్యుఁడు శరకళ యలవఱచికొనుచున్న చోటికిఁ బోయి మొఱుఁగఁ జొచ్చెను. తన లక్ష్యమునకది యడ్డుగానున్నదని తలఁచి యేకలవ్యుఁడు దానినోసట నేడు బాణంబులొక్కటఁ గ్రుచ్చుకొనునట్లు లేసెను. అది యేడ్చుచు నర్జునుని యొద్దకుఁ బోయెను. అర్జునుఁడు దాని నుదుటి శరములం గాంచి, వాని నేసినవాని నైపుణ్యమున కాశ్చర్యపడి, యాశునకముం బురస్కరించుకొని యదిముందు దారిం జూప నా బోయని కడ కేఁగి, "నీ వెవ్వఁడవు? మాకుక్క నేల కొట్టితివి? నీయస్త్ర కళాగురుఁ డెవండు? కుక్క చావకుండ నది నొప్పిమాత్రము చెందునట్లు నీవు దాని ఫాలస్థలంబునం గొట్టిన శర ప్రయోగ విధానముం జూడ నీ నేర్పు కడుఁ బ్రశంసనీయముగా

నున్నట్లు కాన్పించుచున్నది” యని పలికెను. అంతన కా యటవికుఁడు “అయ్యా! నేనొక కిరాతుఁడను. నన్ను ఏకలవ్యుఁడందురు. మీ కుక్క నా గుడిసెకడ్డంకి గల్గింప, దానిని గొట్టితిని. అదియెవ్వరిదో పెంపుడుగుక్క గావున దానిం జంపనేలయనినొవ్వనేసి పాఱఁద్రోలితిని. నా గురుండు ద్రోణుండు. అతని యనుగ్రహముచేతనే నాకు విద్య యలవడినది” అని ప్రత్యుత్తర మిచ్చెను.

ఆ మాటలువిని ఫల్గుణుఁ డచ్చోటువాసి ద్రోణునికడ కేఁగి జరిగినదంతయుఁ జెప్పి; “మహాత్మా! నన్ను ధనుర్విద్య యందు నీతో సమానునిగాఁ జేయువాఁడవనియు, నీశిష్యులలో నన్నుమించినవా రుండఁజాలరనియు నీవు నాకిచ్చిన వాగ్దానమును బట్టి నమ్మియున్నాను. కాని నీ శిష్యులలో నాకన్న నెన్నోమడుంగులు మిన్నయగు నేర్పుగలవాని నొకని నేఁడు చూచితిని. నీవిట్లుచేయుట న్యాయమా?” అని యడిగెను. ద్రోణుఁ డప్పలుకులకు వెఱఁగుపడి వానిం జూపుమనెను. అందఱుంగూడి యేకలవ్యునియొద్ద కేఁగిరి. అతఁడు ద్రోణునిం జూచినతోడనే సాగిలఁబడి మ్రొక్కి యతని కాతిథ్య మిచ్చెను. మట్టితోఁ దన ప్రతిమంజేసి వాఁడు విద్య నేర్పుచుండుటయు వాఁ డస్త్రవిద్యలో నపారపాండిత్య మార్జించుటయుఁ దెలిసి తానర్జునకుం జేసిన వాగ్దానము వీటిబోకుండ జేయుటకై నిశ్చయించి యా యెఱుకుతోనిట్లులనె. “ఓయీ! నీకు నేను గురుఁడనుగదా! గురుఁడు కోరెన “దక్షిణనిత్తువా!

అందుల కాతఁడు "స్వామీ సందేహమా? శిష్యుఁడు తమకీగాని దుంచునా ?" యనెను. అప్పుడు వాని కుడి బొట్టనవ్రేలి నిమ్మని కోరెను. వాఁడు మాఱు మాటాడక యత్యంత భక్తిమైఁ దన దక్షిణాంగుష్ఠముం గోసియిచ్చెను. ఇట్లు ద్రోణుఁడు ప్రియశిష్యుఁడగుట నర్జునునికిఁ దానిచ్చిన మాట నిలువంబెట్టుకొని యతని నప్రతిహతధనుర్వీర్యునిఁ జేసెను.

భీష్మునివలెనే ద్రోణుఁడును ధర్మపరాయణుఁడగుటచే పాండుసూనులయందుఁ బాక్షికబుద్ధి వహించుచుండువాఁడు. కాని కౌరవుల యన్నముం దినుటచే వారికడనే యుండి యుద్ధములో వారిపక్షముననే పోరెను. భీష్మ మరణానంతరమున సర్వసేనాధిపత్యము రారాజు ద్రోణుని కిచ్చెను. బ్రాహ్మణుఁడని శంకింపక తనకే యీ పదవి యిచ్చినందులకు ద్రోణుఁడు సంతసించి సుయోధను నొక వరముకోరుకొమ్మనెను. అతఁడు ధర్మరాజును బద్ధునిఁ జేసి తన యెదుటం బెట్టుమని వరము కోరెను. వానిది యీర్ష్యాస్వభావ మగుటచే నట్టి కోరికఁ గోరెను. కానిచో నల నాఁడు ఘోషయాత్రా సమయమునఁ దన్ను గంధర్వరాజట్లు బంధించుకొని పోవుచుండ దనమాన ప్రాణములు కాపాడినవాఁడీ ధర్మరాజే కదా! అట్టిచో నతనిపై నింతపంతముం బూనఁ గారణ మేముండును? ఈర్ష్యయొక్కటియే హేతువు. వేఱొండులేదు.

కుంభజుఁ డా వరమునకు నర్జునుఁడు ధర్మరాజుదగ్గఱగా నుండకున్నఁ దప్పక ధర్మజుఁ బట్టి యిత్తునని మార్పలికెను. ఆవరముంగూర్చి పాండవులు విని మఱునాఁటి యుద్ధములోఁ

పాండవాగ్రజు నెక్కువ జాగరూకతతోఁ గాపాడుకొనుచు వచ్చిరి. అర్జునుఁడాతని నెప్పు డెడఁబాయకుండెను. కాని వేఱొకచో సంశప్తకులను సుయోధనుని రాక్షస మిత్రులు పాండవసేనల నెదుర్కొనఁగా, వారి రూపు మాపుటకుఁ గృష్ణార్జును లచ్చటికిఁ బోవలసిన వారయిరి. ఇదియే ధర్మజుం బట్టఁదగిన యదనని యెంచి ద్రోణుఁడు కౌరవసేనను బద్మవ్యూహముగాఁ బన్నించెను. ఆ వ్యూహ ముం భేదించుట కర్జునుఁడు తప్ప మఱెవ్వరు సమర్థులుకారు. అర్జునికొడుకు అభిమన్యుఁడు దానింజొచ్చు టెఱుంగుఁగాని వెలువడుట నేరఁడు. అయిననతఁడే యందేగి మహావిక్ర మములఁ జూపి మడిసెను. ధర్మజు బంధము తప్పెను.

ద్రోణుఁడు భీష్ముని వలెనే యతితీవ్రతఁ జూపుచుఁ పాండుసేనలం జెండాడుచుండెను. అతఁడుచూడరాని తేజమున విరాజిల్లుచుండెను. విరటుఁడును ద్రుపదుఁడును వాని జేతిలోఁ జచ్చిరి. ఇంకను బేరెన్నికఁగాంచిన వీరు లెందఱో వీరస్వర్గముం గనిరి. అర్జునుఁ డొక్కఁడే గురు నెదుర్కొని ధైర్యముతోఁ బోరాడ గల్గుచుండెను. ఒకనాటి రేయిఁ బాండవులు శ్రీకృష్ణునింగూడి యొక సభగావించి ద్రోణునిఁ జంపుటెట్టులని యాలోచించిరి. ఏదో యుక్తివలనఁ గాని యతనిఁ జంప సాధ్యముకాదని చెప్పుచుఁ గృష్ణుఁ డిట్లనెను. “అతఁడు చేతవిల్లమ్ముల ధరించి యున్నంతకాలము మనకు జయము లభించుట యరిది. అతని కేదో మహాపత్తు వచ్చిననేగాని యతఁ డస్త్రసన్యాసముం జేయఁడు. కావున

నేనొక యుపాయముం జెప్పెద. దానిం ద్రోసి పుచ్ఛక యాచరింపవలయును. ఆతని కొక్కఁడే కొడుకు. వాఁడు చిరంజీవి. అయినం గలికాలమహిమచే వాఁడు మృతినొందె నని యతనికి నమ్మికఁ బుట్టునట్టుల మీలో ధర్మరాజువంటి సత్యవాక్యధురీణుఁడు పల్కినా, యతఁడు విశ్వసించి యస్త్రములను విడుచును. మీ కప్పు డతని నోడించుట సుకరము.”

ఈ పలుకులు విని ధర్మాత్మజుఁడు తన కీ రాజ్యమే యక్కఱ లేదనియుఁ దానరణ్యములకుఁ బోయి తాపసవృత్తి నుండుఁగాని యనృత మాడననియుఁ జెప్పెను. కాని శ్రీకృష్ణుఁడు రాజనీతిపట్ల నాపద్ధర్మములు కొన్ని కలవనియు, వానింబట్టి యిట్టి సమయమున నబద్ధమాడుట యొక దోష విశేషము కాదనియు, నది యట్లుండ నశ్వత్థామయను నేనుఁ గొకటి చచ్చుటచే ననృతము కప్పవచ్చుననియు, నాతనికి నచ్చఁజెప్పి యతనిచే నట్లు పల్కించెను. అతఁడసత్యమునకు వెఱచుచు ద్రోణునిం డగ్గఱి “అశ్వత్థామ హాత” యని బిగ్గరగాఁ బల్కి “కుంజరః” యను మాట నెమ్మదిగా ననెను. గురుఁడా మొదటిమాట విని నిజముగాఁ దన సుతుఁ డీల్గెనని నమ్మి “హా పుత్రా! యని యస్త్రములం బాఱవైచి మూర్ఛనొందెను. ఇదియే తగిన తఱియని దృష్టద్యుమ్నుఁ డాతని యరద మెక్కి యతని గొంతుఁ గోసి చంపెను.

ఇట్లు బ్రాహ్మణుఁ డయ్యును మహాశౌర్యముం జూపి శత్రువులకుఁ దహతహపాటుఁ బుట్టించిన వీరాగ్రగణ్యుని చరిత్రము మిగుల బ్రశంసనీయము కాదే!

---

# 3. అశ్వత్థామ

అశ్వత్థామ రుద్రునివరమువలన ద్రోణునకుఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁడు పుట్టిన తర్వాత నితని తల్లికిఁ బాలు లేమి చేతనే ద్రోణుఁడు పాంచాలపతికడ కేఁగుట, యతనితోఁ బ్రబల విరోధము పొందుట మున్నగునవి తటస్థించెను. అదియెల్ల వెనుకటిచరిత్రమందుఁ జెప్పఁబడియెఁగదా! ఇతఁడు తండ్రితోఁ బాటు హస్తినాపురముననే యుండి కురుకుమారులతో బాటు శస్త్రాస్త్రవిద్యలు నేర్చుకొనెను. విలువిద్యయం దర్జును నంతవాఁడు కాకపోయినను, విశేష నైపుణ్యము సంపాదించెను. ఇతని కా యస్త్రవిద్యాకౌశలమునకుఁ దోడు గుణోన్నతియుఁ గల్గుటచే గౌరవులును పాండవులును నితని గురునిచందముననే గౌరవించుచుండిరి.

భారతయుద్ధమున నీతఁడు గౌరవపక్షముననె నిల్చి తండ్రితోఁబాటు పాండవుల నెదిర్చి తన యనంతశౌర్యముం బ్రకటించెను. పాండుతనూజులు తనతండ్రి నన్యాయముగాఁ జంపించిరని విని యతఁడు పట్టరాని కోపముం జెంది నారాయణాస్త్రమును పాండవసేనపైఁ బ్రయోగించెను. ఆ యస్త్రమునకుఁ దిరుగులేదు. అప్పుడు పాండవులు సంక్షోభపడఁ జొచ్చిరి. కృష్ణుఁడా యస్త్ర మాయుధవిహీనుల నేమియు జేయఁజాలదని చెప్పి పాండుసేనల నన్నిటిని శస్త్రాస్త్రములు క్రిందబెట్టి దానికి నమస్కరింప నాజ్ఞాపించెను. అందఱట్లు చేయఁగా నయ్యమోఘాస్త్రమువలన హానితప్పెను.

తండ్రి మృతిజెందిన తరువాత సేనాధిపత్యము రారాజు తనకే యిచ్చుననియు నప్పుడు కుంతీనందనులను ముప్పుతిప్పలం బెట్టవచ్చుననియు నశ్వత్థామ యూహించి యూరకుండెను. కాని యతఁడట్లు చేయక తన ప్రాణమిత్రుఁడగు కర్ణుని కా పదవి నిచ్చెను. అశ్వత్థామకించుక నిర్వేదము తోచెను. అట్లని యతఁడు దుర్యోధనుని విడిపోక యథాశక్తి నితర స్థలములఁ బోరుచునే యుండెను.

భీష్మ ద్రోణులతోఁ బాటు కర్ణ శల్యాదులును గూలిరి. కౌరవులలో వీరులసంఖ్య మిక్కిలి యల్పముగా నుండెను. అప్పుడు దుర్యోధనుఁడిఁక నెట్లును దన కపజయము తప్పదని నిశ్చయించుకొని ద్వైపాయనహ్రద మనఁబడు నొక చెఱువులో దిగి తనకుఁగల జలస్తంభనవిద్యవలన నందుఁ డాగి యుండెను. అది యశ్వత్థామకుఁ దెలిసి కృప కృతవర్మలతో నచ్చటికేఁగి "రారాజా! నీ విందే యుండి యించుక విశ్రాంతి గొనుము. రేపు నీవును నేనునుగూడి పాండవులనెల్ల మట్టు బెట్టుదము. పాండవులు వచ్చి నిన్ను సమరమునకుం బురికొల్పినను, నీవు సిద్ధపడకుము" అని చెప్పి పోయెను. అతఁడట్లు చెప్పఁ గలుగుటకుఁ గారణమేమన నతఁడొకతఱి శివునిఁ గూర్చి తపంబుచేసి యతనివలన నొక్కనాఁడు పాండవుల మీఁద సంపూర్ణ జయముం గాంచునట్లు వరముంబడసెను. కావున నా మఱునాఁడు శివుని సహాయమునఁ బాండవ వినాశముం గావించి రాజు ఋణముఁ దీర్చుకొందమని యతని యాశయము. కాని దుర్యోధనుఁ డతఁడు చెప్పినట్లు

చేయక, పాండుసూనులు పల్కిన పోటుమాటలకోడి భీమునితో నెక్కటికయ్యమున కియ్యకొనెను. భీముఁడుకూడ నక్రమయుద్ధమునకు బూని గదాఘాతముల నతనితొడలు విరుగఁగొట్టి నేలగూల్చెను. అశ్వత్థామవచ్చిచూడ, రారాజు కొనప్రాణముతో నుండెను. అతనికి మిగుల దుఃఖముతోచి "నే నిదేపోయి పాండవుల నెల్ల పరిమార్చి యీ శుభవార్త నీ చెవులను వేయుదు" నని తీవ్రదృష్టితో నేఁగెను.

అతఁడు పోవుచుండఁగా దారిలో నొక వటవృక్ష శాఖపై గూడుఁగట్టుకొని యున్న కాకిపిల్లల నొకఘూకము వచ్చి యవి నిద్రించుచుండఁ జూచి చంపి తినుచుండెను. ఆ దృశ్యమువలన నతనికి నిద్రలోనున్న పాండవుల నెల్ల జంప బుద్ధిపుట్టెను. తన యభిప్రాయ మతండు మేనమామ కెఱింగించెను. కాని యతఁడు కేవల మక్రమమని వారించెను. అయిన నతఁడు మామమాటల సరకుఁగొనక యర్ధరాత్రమునఁ బాండవ శిబిరముం బ్రవేశించెను. ఆగతానాగతవేదియగు శ్రీకృష్ణుఁడది ముందే కనిపెట్టి యుండుటచేఁ బాండవపంచకమును, ద్రౌపదిని నచ్చటినుండి తప్పించి వేఱొండు తావునకుఁ గొంపోయెను. అశ్వత్థామ క్రోల్పులివలె శిబిరముంజొచ్చి ముందు దృష్టద్యుమ్నునిం జిత్రవధఁ గావించి యావల శిఖండిని నుపపాండవులను దెగటార్చెను. పాండవులు తనకు దొరకమికి మిగుల వగపొందెను.

ఇరువురు సోదరులు నేవురు మిత్రులు నొక్కపర్యాయమే మృత్యువు వాతఁబడిరని విని ద్రౌపది యింతింత

యనరాని శోకముంబొందెను. భీముఁడామె శోకమునుజూచి సహింపఁజాలక యాబాలఘాతకునిం గట్టి తెచ్చి నీయెదుటనే వధింతునని పల్కి పోయి యశ్వత్థామ నోడించి ద్రౌపది యెదుటికిం గొని తెచ్చి వధింపఁబోయెను. కాని యామె కారుణ్యస్వరూపిణి యగుటచే "నాథా! నా పూర్వభవ పాపముచే నేను పుత్రశోక మనుభవించు చుంటిని. ఇతం డొనర్చినది కేవలము నిమిత్తమాత్రము. ఇతనిం జంపిన నేకపుత్రయు విగత భర్తృకయు నగు కృపికి రెండు తెఱంగులైన దుఃఖము కలుగదా? దురదృష్టవశమున నాకుఁ గల్గిన పుత్రదుఃఖము నా సోదరియగు మఱియొక హైందవ నారీరత్నమునకుంగూడఁ గూర్పనేల! దాన నా శోక మేమేని తగ్గునా! కావున నా ప్రార్థన మాలించి యీతనిని విడిచి పుచ్చు" మని పలికెను. భీముఁడామె కరుణకు మెచ్చి యశ్వత్థామను విడిచిపుచ్చెను.

ఆవలఁ దాఁ బరిభవమందినను దాను రారాజుచేసిన వాగ్దాన ప్రకారము కొంతవఱకైన నెఱవేర్చి యీ వార్త యాతనికి వివరించెను. దుర్యోధనుఁడు గురుపుత్రునకుఁ గల రాజభక్తి కెంతో కొనియాడి "మహానుభావా! నీవంటి శౌర్యసంపన్నునకు సర్వ సేనాధిపత్య మొసంగక స్నేహ పక్షపాతమునఁ గర్ణునకే దానినొసంగి చేటుఁ దెచ్చుకొంటిని. నా యపచారమును మన్నింపు" మని వేఁడుచుఁ బ్రాణముల వీఁడెను.

రాజునకై పోగు లోకవంకఁ, బరాభూతక్రోధ మొక వంక దన్నుఁ బీడింప నశ్వత్థామ మఱలఁ బాండవులనందఱిం జంప నుద్యుక్తుఁడై తనతండ్రి తనకొసంగిన బ్రహ్మశిరమను నస్త్రమును నిమంత్రించి మొనర్చి "యపాండవం బగుఁగాక" యని సంకల్పించి ప్రయోగించెను. అది ప్రళయకాలోజ్వల జ్వాలాజాలముతో బయలుదేఱెను. దానిం గని యర్జునుఁడు కృష్ణుఁడుపదేశముపై బ్రహ్మశిరోనామకమును బ్రయోగించెను. అదియు నట్టి మంటలనే గ్రక్కుచు బయల్వెడలెను. ఈ రెండు అస్త్రములవలన లోకమునకుఁ బ్రళయము తటస్థమగునని భయపడి నారదుఁడును వ్యాసుఁడును వాని మధ్యమున నిల్చి యుభయులను నస్త్రముల నుపసంహరింపుఁడని కోరిరి. అర్జునుఁడు వారి యాజ్ఞ కొడంబడెఁ గాని యశ్వత్థామ యొడంబడక "భీముం డన్యాయ యుద్ధమున రారాజుం గూల్చెను. నేనతని ప్రియసేవకుఁడను. అతనికిఁ బ్రియమైన కార్య మొనర్పకున్న నే ద్రోహి నగుదును. కావున నాపట్టు విడువ" నని పల్కెను. కృష్ణుఁడు, నీ యస్త్ర మర్జునుని యస్త్రముతోఁ బోరునుగాని పాండవుల నేమియుఁ జేయఁజాలదనెను. అంతట నతఁడది 'పాండవసతుల గర్భములందున్న పిండములను భేదించుఁగాక' యనెను. అప్పుడు కృష్ణుఁడాత్తచక్రుఁడై యుత్తరాగర్భమున నున్న పిండ మొక్కటి ప్రహాతము నిల్పి పాండవ కౌరవ వంశముల కొక్క మొలకయైన నిల్పినవాఁడయ్యెను. మఱియు వాసుదేవుఁడు "నీవు బాలఘాతివి కావున భుక్తిలేక నిస్సహా

యుఁడవై దుర్గంధరక్తమున నవయవములు కృశించుచుండ మూఁడు వేలేండ్లుభూమిపై మనెదవుగాక" యని యశ్వత్థామను శపించెను. అశ్వత్థామ వ్యాసాదులచేఁ బ్రబోధింపబడి పశ్చాత్తప్తచిత్తుఁడై తన శిరోభూషణములను పాండుసూనుల కొసంగి తానుఁ దపోవనమున కేఁగెను.

మొదట నతనికి సరియైన యవకాశము లొసంగఁబడె నేని భారతయుద్ధమున నతఁడు విశేషనష్టమును పాండవులకుఁ గల్గించి యుండును. పాండవులు జయించుట కింకను గష్టపడ వలసి వచ్చియుండును. ఎటులైన నతఁడు మహావీరుఁడే!

---

# 4. కర్ణుఁడు

కుంతి కన్యగానుండ నామె జనకుఁడగు కుంతిభోజు నింటికి దుర్వాసముని వచ్చెను. కుంతిభోజుఁ డాతనికి యథోచితముగ నాతిథ్య మొసంగి యతనికి సేవలొనర్పఁ గుంతి నప్పగించెను. కుంతి శ్రద్ధాభక్తులతో మునికి సపర్యలుసల్ప నతఁడు ముదితుఁడై యామెకొక మంత్ర ముపదేశించెను. ఆమంత్రము బఠించి యామె యేదేవత నారాధించిన నాదేవత ప్రత్యక్షమై యామెకు సత్సంతానము నొసంగునని ముని చెప్పిపోయెను. ఆ మంత్రప్రభావముం బరీక్షింపగోరి కుంతి సూర్యు నారాధించెను. ఆతఁడు వచ్చి మహాతేజస్వంతుఁడగు నొక్క పుత్రు ననుగ్రహించియేఁగెను. తనకన్యాత్వమందే యిట్టిబిడ్డపుట్టుట

వినిన, లోకము పరిహసించునని భయపడి, కుంతి యాశిశువు నొక పెట్టెలోఁ బెట్టి నదిలో విడిచిపెట్టెను. ఆపేటిక చిత్రరథుఁ డను సూతునకుఁ దొరకఁగా, నతఁడాబిడ్డ నెత్తుకొని తన భార్యయగు రాధ కిచ్చెను. వా రా చిన్ని పాఁపకుఁ గవచకుండలములుండుటంబట్టి కర్ణుఁడని పేరుపెట్టి, వానిని మిగుల గారాబముతోఁ బెంచుచుండిరి. బిడ్డఁడును బాలసూర్యునివలె దిన దినముఁ బెరుగుచుండెను.

కురుకుమారులకు ద్రోణుఁ డస్త్రవిద్య నేర్పుచుండఁ గర్ణుఁడు ద్రోణునికడ కేఁగి తనకుఁ గూడఁ దద్విద్య నేర్పుమని కోరెను. కాని వాఁడు శూద్రుఁడగుటచే వేదవిద్య నేర్ప వలనుపడదని గురుఁడు వాని కోరిక నిరాకరించెను. అతఁ డక్కడినుండి మహేంద్రపర్వతమునకుఁ బోయి యందుఁ దపోనిష్ఠయందున్న పరశురాము నాశ్రయించి తనకు ధనుర్విద్య నేర్పుమని వేఁడెను. తన కులగోత్రాదులఁ గూర్చి భార్గవుఁ డడుగఁగాఁ దాను ద్విజుఁడనని చెప్పెను. పరశురాముఁడతని తేజస్సును బుద్ధిసూక్ష్మతయుఁ గాంచి సంతోషపూర్వకముగ నతనికి నస్త్రశిక్ష పూర్తిగాఁ గఱపి తనకడనున్న యుత్తమాస్త్రములు కొన్ని యాతని కొసంగెను.

కర్ణుఁడు పరశురామునికి శుశ్రూష చేయుచుండగా నొకనాఁ డతని బాణమొకటి యొక బ్రాహ్మణుని గోవునకుఁ దగిలి యది మృతినొందుట తటస్థించెను. అది విని భూసురుఁ డాగ్రహించి యుద్ధమున మంచి యక్కఱ గల్గుతఱి నీ రథచక్రము నేలఁ గ్రుంకుఁగాక యని శపించెను. మఱియొకనాఁడు

రాధేయుని తొడపైఁ దలనిడుకొని భార్గవుఁడు నిద్రించు చుండ, నొక కుమ్మరిపుర్వు వానితొడఁ దొలఁచు చుండెను. తాను గాలింగదల్చిన గురుఁడు లేచు నేమో యనుభయమునఁ గర్ణుఁడా బాధ నోర్చి మిన్నకుండెను. తొడనుండి నెత్తురు కాల్వఁగట్టుచుండెను. ఆ రక్తమునఁ బరశురాముని మేనించుక తడియుటచే నతఁడు మేల్కాంచి "కర్ణా! యిదేమి! ఈ నెత్తు రెట్లు వచ్చె" నని యడిగెను. అతఁడు జరిగినదంతయుఁ జెప్ప భార్గవుఁడు విని యింతటి సహనగుణము కలవాఁడు బ్రాహ్మణుఁడగునా యని శంకించి "ఓయీ! నీ వేకులము వాఁడవో నిజముఁ జెప్పు" మని యడిగెను. అతఁడు భయకంపితుఁడై తాను సూతుండనని యొప్పుకొనెను. అందుమీఁద బరశురామునకుఁ గోపమువచ్చి 'ఔరా! నీవు నన్నుఁ గికురించి విద్యసంపాదించితివి గావున, నీకది సమయమునకు స్ఫురింపకుండుఁగాక' యని శపించెను. ఇట్టులాతని ప్రయాసము కొంత వమ్మయ్యెను.

ఎట్టులో యాతఁడస్త్రవిద్య నభ్యసించి హస్తినాపురముం జేరుకొనెను. అప్పటికిఁ గురుకుమారులుకూడ విద్య ముగించిరి. కుమారవిద్యా పరీక్షను గావింపఁ గురువృద్ధులు కుతూహలపడి యొక సభ నేర్పాటు చేసిరి. అందు జంట పోరాటములలో భీమసుయోధనులు తలపడిరి. భీముఁడెక్కువ కుశలుఁడని సభ్యులు నిర్ణయించిరి. ఇట్టులే యిరువు రిరువురు తలపడి వారి కౌశలముం జూపి యెవరో యొకరు మెప్పొందుచుండిరి. అర్జునుని నెదుర్కొనఁగల వీరుఁడే యాకుమారవర్గ

మునఁ గనఁబడకుండెను. వాని కీఁడగువాఁ డెవ్వఁడేని యుండిన బాగుగ నుండునని దుర్యోధనుఁ డూహించుచుండెను. అత్తఱిని జూపరులలో నున్న కర్ణుఁడు ముందునకుఁ వచ్చి దా నతనితోఁ బోరెదనని సిద్ధపడెను. అతని శరీర కాంతియు ముఖవిలాసమును జూచి యందఱచ్చెరువుపడిరి. కాని యతఁడు సూతుఁడగుటచే ననర్హుఁడని భీమాదు లపహాస్యము చేసిరి. దుర్యోధనునకుఁ బాండవులమీఁదఁ గోపమును గర్ణుని మీఁద ననుగ్రహముఁ గల్గి "వానికి నంగరాజ్యమిచ్చి రాజ్యాభిషేకము నేనొనర్తును. వానిం బోరనిండు. అర్జునా! నీవే పోటుమానిసివా ? లోకములో నింకెవ్వరు లేరా?" యని పలికెను. ద్రోణాదుల యనుమతిపై గర్ణార్జునులు తలపడిరి. అర్జునుఁడే గెలుపొందినను, గర్ణుండుగూడఁ దాదాపుగా సమప్రజ్ఞ గలవాఁడేయని యెల్లరు నుడివిరి. దుర్యోధనుఁడు కర్ణుం గౌఁగిలించుకొని "నీవు నాగౌరవము నిలువఁబెట్టితివి. నాకు ముఖ్యస్నేహితుఁడవై నామన్ననలం గొనుచుండు" మని పల్కెను.

పిమ్మట సుయోధనుఁడు కర్ణు నంగరాజ్యాధిపునిగా జేసి గౌరవించెను. ఒక సామాన్యమానవుఁడుగాఁ బరిగణింపఁ బడుచు శూద్రుఁడగుటచే వేదాదివిద్యలఁ బొంద ననర్హుఁడని నిర్ణయింపఁబడిన తన్నారీతి ధార్తరాష్ట్రుఁడు గౌరవించి నందులకుఁ గర్ణుఁడెంతో సంతోషమంది యతని కామరణాంత దాస్యమొనర్ప బద్ధకంకణుఁడయ్యెను. అతఁ డంగరాజుగ నుండి చూపిన వదాన్యత మిగుల ప్రశంసనీయము. అడిగిన

వారికి లేదనకుండ సమస్తదానము లొనరించి దానకర్ణుఁడను ప్రసిద్ధాభిధానములఁ బడసెను. తన దాతృత్వ నియమముచేఁ దనకెన్నో యిడుములు పొడముచున్నను, నతఁడు దానిని మానకుండెను. కౌరవ పాండవులు విశేషముగా విజృంభించి యున్నప్పుడు, దేవేంద్రుండు కర్ణార్జునులకుఁగల వైరమెఱింగి తన కుమారుఁడైన యర్జునకు మేలుసేయఁగోరి బ్రాహ్మణ రూపమునఁ గర్ణునొద్దకువచ్చి యతని సహజనితములైన కవచకుండలముల నిమ్మని యర్థించెను. కర్ణుఁడు కొంకక వానినీయ సిద్ధపడుచుండ, సూర్యుఁడుకూడ భూసురరూపమున వచ్చి కవచకుండలములం గోల్పోవవలదనియు, నావచ్చిన వాఁడు పాండవ హితార్థియగు సురపతియనియుఁ జెప్పెను. కానికర్ణుఁడామాటలుపాటింపక "సురపతియేవచ్చినన్నర్థించుట కన్న నాకుఁ గావలయున దేమి ? అదిగాక నశ్వరమైన యీ దేహముకొఱకు శాశ్వతమైన కీర్తిని బోఁగొట్టు కొందునా ? వలయునన్న నతనికి నాప్రాణములుగూడ నర్పింతు" నని జవాబిచ్చెను. ఆవల నింద్రునికిఁ గవచకుండలముల నొలిచి యిచ్చి కృతార్థుఁడయ్యెను. ఇంద్రుఁడు వాని సత్యవాక్య ధురీణతకు మెచ్చి యమోఘమైన శక్తి నాతనికిం బ్రసాదించి తనలోకమునకుం జనెను.

కర్ణుని దానగుణమేగాక యతని రాజభక్తియు మిగుల స్తోత్రపాత్రము. అజ్ఞాత వాసానంతరమునఁ బాండవులు శ్రీకృష్ణుని దుర్యోధనుని యొద్దకు రాయబారిగాఁ బంపిరి. దుర్యోధనుఁడు పాండవులకు రాజ్యభాగమేమియు నీయ

ననెను. ఉభయ పక్షములకును యుద్ధము తప్పదని నిశ్చయింపబడెను. కృష్ణుఁడు కౌరవసభవీడి విదురునింటికి వచ్చునపుడు కర్ణుని దనతోఁగూడఁ బిలుచుకొని వచ్చి యిట్లనెను, "కర్ణా! నీవు కుంతి కగ్రతనూజుఁడ వగుట నీవెఱుఁగవు. ఇప్పుడు కురుపాండవ యుద్ధమున నీవేకోదరులతోఁ బోరి వారిచే నిహతుండవగుట నాకిష్టము లేదు. నీవు కౌరవపక్షమున వీడిరమ్ము. మనమందరముంగూడఁ గౌరవుల నోడింతము. నీ తమ్ములగు పాండుసూను లేవురును నిన్ను హస్తినాపుర రాజ్యపీఠమున నిల్పి నీకానందముతో సేవలొనర్తురు. సంకోచింపకరమ్ము."

ఆ నుడువులు విని కర్ణుఁడు "కృష్ణా! నీపలుకులు సమంజసములుగాఁ దోపవు. నాపుట్టువుంగూర్చిన రహస్యమెఱుకపడినందులకు నాకానందమే. కాని నేనెందునకుం గొఱగాని హీనుఁడనని లోకులును, వారితోఁబాటు పాండుకుమారులును నన్నెన్ను సమయమున సుయోధనుఁడు నాకాశ్రయమిచ్చి తనహృదయమిచ్చి యంగరాజ్యముం గూడ నొసంగెను. అట్టి మహోపకారిని గష్ట సమయమున వీడి తుచ్ఛరాజ్యమున కాసింతు ననుకొంటివా? నీవు భగవానుఁడవు. పాండవులది ధర్మపక్షము. ధర్మమెట్లులైన జయింపక మానదు. అదిగాక నేనిప్పుడు పాండవ పక్షముం జేరితినేని, ప్రజలెల్ల నరునకు వెఱచియే యట్లుచేసెనని యపవాదము మీఁదవైవకమానరు. కావున నీ యుపదేశమనుసరింపఁజాలమికి నన్ను క్షమింపు"మని బదులుపల్కెను.

కృష్ణుఁడు వాని హృదయశుద్ధికెంతయు గొనియాడెను. కృష్ణుఁడేకాక కుంతిసహిత మొక పర్యాయము కర్ణునింజేరఁ బిలిచి దాను దల్లియగుట యెఱింగించి పాండవపక్ష మవలంబింపుమని కోరెను. ఆమెకును గృష్ణుని కిచ్చిన యుత్తరమే యిచ్చి "అమ్మా! నేనో, యర్జునుఁడో మడియక తప్పదు. పరమేశ్వరుఁడగు కృష్ణుఁ డా పక్షమున నుండుటచే మూఁడు వంతులు నేనే మడియవచ్చును. నీకెట్లైన నేవురుసుతులే యుందురు. అదిగాక, లోకములోఁ బంచపాండవు లనియే ప్రసిద్ధిగల్గెను. అదియే స్థిరముగావలె గాని మార్పు గలుగ రాదు; అయిన నొకమాట యిత్తును. నేనర్జునుని దప్పఁ దక్కుంగల నీసుతుల నేరినిం జంపను" అని ప్రతివచనంబిచ్చి యామెనంపెను.

యుద్ధమందు సూతసూతి చూపిన పరాక్రమాదులు కూడ స్తుతియోగ్యములు. ద్రోణుఁ డీల్గినతర్వాతఁ గర్ణుఁడు సర్వసేనాధిపతియయ్యెను. ఇతఁడు రెండుదినములుమాత్రమే యుద్ధముచేసెను. ఆ రెండు దినములలాతఁడు కనంబఱచిన శౌర్యము నిరుపమానము. అర్జునుఁడంతటివాఁ డొకనాఁడా కర్ణునిధాటికోర్వజాలక "మాధవా! మనరథము నుఱలనిమ్ము. బ్రతికియున్న సుఖంబులుబడయవచ్చు"నని పల్కెను. ఒకప్పుడతఁడునకులునింబట్టి పరాభవించెను. మఱియొకతఱి భీముని మిగులనొప్పించెను. వేఱొకసమయమున ధర్మరాజుదేహమంతయు బాణములతోఁ గుట్టివైచెను. కాని యట్లు చేఁజిక్కిన పాండవుల నెవ్వరిని సమయభంగ మగునని చంపకుండెను.

ఇంకొకతఱి నితఁడింద్రుఁడిచ్చిన శక్తినిఁ బ్రయోగించి యర్జును నిం జంప నుంకించుచుండ శ్రీకృష్ణుఁడది భీముని పుత్రుఁడగు ఘటోత్కచునిపై మఱలించి యప్పటి ముప్పుఁ దప్పించెను. ఆరీతిగా శక్త్యాయుధము వ్యర్థమై పార్థునిం దునుమఁజాల నందునకు రారాజు చింతింపగాఁ గర్ణుండు "మిత్రమా! చింతింపకుము. నరున కెంతబలముండినను నుండనిమ్ము. అతని దివ్యరథము, అక్షయ తూణీరములు మున్నగున వెన్ని యున్నను నుండనిమ్ము. నాకేమియు వెఱపులేదు. వానికున్న బలములలోని కెల్ల మిన్నయనఁదగినది శ్రీకృష్ణుని సారథ్యము. నాకును సమర్థుఁడగు సారథియున్న నరుండును గిరుండును నాకొక భ్రాంతికాదు. మద్రేశ్వరుఁడగు శల్యుఁడు సారథ్యం బున సామర్థ్యంబు విశేషంబుగాఁ గలవాఁడని విందు. అతనిని నాకొప్పింపు" మని చెప్పెను.

దుర్యోధనుఁడు శల్యునిం బ్రార్థింప నతఁడు కర్ణునికి సారథిగానుండ సమ్మతించెను. శల్యుఁడు నకులసహదేవుల మేనమామ. యుద్ధమునకుఁ దనకుఁ దోడ్పడుమని దుర్యోధనుఁడే ముందుకోరుటచే నతఁడు కౌరవపక్షమున నిల్చెను. గాని, లేకున్నఁ బాండవపక్షమునఁ జేరదగినవాఁడే. అయిన నతఁడు ధర్మజున కొసఁగిన వాగ్దానప్రకారము హృదయమునఁ బాండవపక్షమే వహించి పోరి యందుఁ గర్ణుని నిరుత్సాహపఱచుచు నతని రథంబుఁ దప్పుదారులఁ ద్రిప్పుచు వచ్చెను. తుదకుఁ గెలిచ్చి ధర్మరాజు చేతిలోఁ బాణములను గూడఁ గోలుపోయెను.

కర్ణుని రెండవ దినంపు సమరంబునఁ గర్ణార్జునులకుఁ బ్రవర్తిల్లిన జగడము దుర్నిరీక్ష్యమైనది. వారిలో నొకనికి నాఁడు చావు మూఁడినదని యెల్లవారికిఁ దోఁపకుండలేదు. బాణాగ్నులు భూనభోంతరాళములు నిండిపోవుచుండెను. కర్ణుఁడమోఘమైనసర్పశరమును నరునిపైఁ బ్రయోగించెను. అది విషాగ్నులం గ్రక్కుచుఁ బార్థునిమీఁదికి వచ్చుచుండెను. పాండవపక్షమువా రెల్ల నాహాకారవము లొనర్చుచుండిరి. కాని కృష్ణుఁడు తన నేర్పున రథంబుఁ గ్రిందికి దిగఁద్రొక్కెను. ఆ యస్త్రము నరుని కిరీటముమాత్రము పడఁగొట్టఁగలెను. కాని నరుని కెట్టి కీడును జేయఁ జాలకపోయెను. ఇంకొక సమయమున రాధాతనూజుని రథచక్రములు రెండును నేలలోఁ గ్రుంగిపోయెను. అది నాఁటి బ్రాహ్మణ శాపము వలనఁ గల్గినది. సూతుఁడగు శల్యుఁడు ధర్మరాజుచే మడి యింపఁబడెను. కర్ణుఁడే రథము దిగి చక్రములను సవరించు కొనవలసివచ్చెను. అతఁడట్లుచేయుచుండఁ గృష్ణుఁడు "అర్జునా! ఇదియే తగిన సమయము. కర్ణుని దీవ్రబాణములనొప్పింపుము. ఈతటి తప్పిన నతని జయించుటకు నీకు వీలుండదు. జాగు చేయకు'' మని పల్కెను. అర్జునుఁడు నిరాయుధుం గొట్టుట యన్యాయమన నీ కింక వేఱొండుమార్గమే లేదని కృష్ణుఁడు పల్కి యతని నొప్పించెను. అంత నర్జునుఁడుతీవ్రనారాచముల గర్ణునిపైఁ బ్రయోగించెను. కర్ణుఁడు "అర్జునా! సర్వధర్మము లెఱింగినవాఁడ విట్లు చేయఁదగునా? నా చక్రము లెంచుక లేవ నెత్తుకొననిమ్ము. కాక యధర్మమునకే యొడిఁగట్టుదేని

నీ ఇచ్చవచ్చినచొప్పననే చేయు" మనెను. అర్జునుఁడు బాణ ప్రయోగమును మానకుండెను. కర్ణుఁడు చేయునదిలేక భూమి పై నిల్చియే మిగుల ధైర్యముతోఁ బోరాడజొచ్చెను. అత్త రిని కృష్ణార్జును లెన్నో నిందావాక్యములను గూడఁ గర్ణు ననిరి. అతఁడు కానికాలము వచ్చినదని యోర్పున నుండి పోరుచుండెను. అంతఁ గృష్ణప్రేరితుఁడై యర్జునుం డొక దివ్యశక్తిం బ్రయోగించి కర్ణుని శిరచ్ఛేదముం గావించెను. దుర్యోధనుఁడు తన కుడిభుజమే పడిపోయినదని యెంచి యింకఁ దన కోటమి ధ్రువమనియే నమ్మి నిరుత్సాహుఁ డయ్యెను.

ఇట్లు మహాపరాక్రమశాలి, సత్యసంధుఁడు, దానశీలి, రాజభక్తిపూర్ణుఁడు, త్యాగరాజునగు కర్ణుఁడు స్వీయరక్త మును రారాజుకై యర్పించి ధన్యుఁడై వీరస్వర్గముం జూఱఁగొనెను.

## 5. దుర్యోధనుఁడు

ధృతరాష్ట్రసూనులలో దుర్యోధనుఁడు జ్యేష్ఠుఁడు. ఇతఁడును భీముఁడును నొక్క వయస్సువారు. ఇరువురును సమాన బలముగలవారు. ఇతనిపై ధృతరాష్ట్రున కతీతమైన ప్రేమగలదు. ఆకారణమున నితఁడాడినదే యాటగను, పాడి నదే పాటగను జరుగుచుండెడిది. ఇతనికి దమ్ములలో దుశ్శా సనుఁడును, మేనమామయగు శకునియుఁ, గర్ణుఁడును ముఖ్య

స్నేహితులు. ఈ నలువురకు దుష్టచతుష్టయమని గ్రంథ కర్తలు పేరిడి యున్నారు. కాని సత్యమారసిచూడ దుర్యోధనునియం దంతగా దుష్టత్వ మున్నట్లు కనబడ కున్నది. అతనిలో దుర్గుణములకన్న సుగుణములే యెక్కువగా నున్న వనవచ్చును. ఆ సుగుణములనే ప్రశంసింతముగాక!

కురుదేశమునకు రాజు ధృతరాష్ట్రుఁడు. పాండురాజు కనిష్ఠుఁడగుటచేతను, పాండురోగపీడితుం డగుటచేతను రాజ్యార్హతను గనకుండెను. కావున రాజ్యము న్యాయముగా ధార్తరాష్ట్రులదే. పాండవుల కందు భాగ మీయవలసిన యవసరము లేదు. పాండవులు తండ్రిలేని బిడ్డలుకావున, వారిని దనయొద్ద నుంచుకొని యంధరాజు పెంచుటయెంతయు బ్రశంసనీయము. కాని వారికిఁ దన సుతులకన్న యధికార సౌకర్యాదులన్నియు నొంబికేయుఁడు కూర్పవలయు ననుట తగదు. మఱియు భీమ సుయోధనులు సమాన బలులు. కావున తఱుచుగాఁ బోరాడుచుండిరి. అందు భీముఁడే జయ మొందినప్పుడు దుర్యోధనునివంటి జాత్యభిమానము గల క్షత్రియపుంగవునకు మాత్సర్యముండుట యాశ్చర్యము కాదు. అట్టి మత్సరవృత్తి భీమసేనునికిమాత్రము లేదా?

తరువాత నన్నదమ్ముల వివాదములు పెరుగకుండఁ బాండవులకు సగము రాజ్యమిచ్చి తక్కుంగల సగమును దుర్యోధనున కంధరాజిచ్చెను. నిజముగాఁ దన సుతునకు మాత్రమే చెల్లవలసిన రాజ్యములోఁ గొంత యొరున

కిచ్చినపుడా సుతున కించుక మాత్సర్య ముండకుండుట యరిది. పిమ్మట ధర్మరాజు మయసభం గట్టించి రాజసూయ యాగముఁ గావించెను. పౌరుషవంతుఁడగు క్షత్రియుఁ డెవ్వఁడును బరప్రకర్షము సహింపఁ జాలఁడు. అట్టిచో దుర్యోధనుఁ డంతకును సహించి రాజసూయమున కేఁగ నక్కడ నతని కా సభాస్థలమర్మములం దెలుపక యందతనిం బ్రవేశపెట్టి పురుషులేకాక స్త్రీలుకూడ నతనింజూచి నవ్వ సాగిరి. ఇంతకన్నమానవంతున కింకొక యవమానముఁ గలదా! దానికి లోలోననే బరితపించుచు రారాజు గృహమున కేతెంచి తన ప్రాణమిత్రులతో యోజించి మేనమామ నియోగంబున మాయాద్యూతకల్పన మొనరించెను. అది యకార్యమే యైనను యతనికి ధర్మజుండొడఁబడ నేల? అతఁడు విదురాదులు పల్కు మాటలు సరకుఁగొనక మైమఱచి పందెముపైఁ బందె మొడ్డి రాజ్యసర్వస్వ మోడి నింద యంతయు సుయోధనునిపై మోఁపనేల ?

అటుపిమ్మట ద్రౌపదీమానభంగ మొనర్ప యత్నించుట దుర్యోధనుని తప్పులలో గొప్పదనవచ్చును. అందున కతఁడు దండ్యుఁడే. కాని యతఁడావలఁ బెద్దల మాటలు పాటించి మఱల రాజ్యమును బాండవుల కిచ్చివైచెనే! ధర్మరాజు మఱల ద్యూతావేశమునకు లోనుగానేల? వారరణ్యవాసక్లేశమందుట వారొడ్డిన పందెముంబట్టియే కాని, దుర్యోధను నాజ్ఞ కాదే! అందుఁగూడ గాంధారేయుఁడు నింద్యుఁడుగాఁడే!

అజ్ఞాతవాసానంతరమున పాండవులు కృష్ణుని రాయబారిగాఁ బంపినపుడు దుర్యోధనుఁడు వారి పాలు వారికిచ్చి యుండిన నెట్టిచేటును లేకుండును. కాని ఘోషయాత్ర యందుఁ దనకు గంధర్వులచేఁ గల్గిన పరాభవము, గోగ్రహణ కాలమందు నర్జునునివలనఁ దటస్థించిన యవమానము మున్నగునవి యన్నియు నతని మదిని బాధింప నతఁడు దాని నీయకొనకుండెను. అదియు నతని దోషమే. కాని యతఁడు తన బలమందును దనవారి బలమందును మిగుల విశ్వాసము గలిగియుండ తాన జేయుఁడనని తలంచి సంధి కియ్యకొనలేదు. తండ్రికూడ సంధి చేసికొనుటయే మేలని చెప్పినప్పుడతఁడు "జనకా! పాండవులు మమ్ము జయింతురనుట నమ్మఁదగినది కాదు. భీష్ము నెదిరింపఁగల వీరుఁడు వారిలో నొక్కఁడు గలఁడా? ద్రోణునిఁ బ్రతిఘటింప నెవ్వరికిఁదరము? కృపాశ్వత్థాముల కీడైన జోదులెవ్వరు? ఫల్గునుఁడే యందఱ నిర్జించు నందువేని వానిని ముప్పుఁ దిప్పలఁ బెట్టఁగల్గు గర్ణుఁడు లేఁడా? వారు కాక నాకొఱకుఁ బ్రాణముల నర్పింప నెందఱో శూరాగ్రేసరులు సంసిద్ధులై యున్నారు. కావున మన మోడుదుమని భయపడనక్కఱలేదు. ఒకవేళ నోడినను, బౌరుషముంజూపి వీరస్వర్గముం జూఱగొనుట క్షాత్రధర్మమే కదా? కావునఁ దండ్రీ! సంధిమాటఁ దలంపకు" మని బదులుపల్కెను.

అతఁడు మంచి యెక్కుడనున్నను గ్రహింపఁ దగ్గదని యెఱుఁగును. కావుననే కర్ణుఁడు సూతసూతియైనను వానితో నెయ్యమొనర్చి వానినిమూర్ధాభిషిక్తునిగఁ జేసెను. అతనికి సర్వసైన్యాధిపత్యమిచ్చెను. అతఁడు రాజ్యముచల్లఁగ నేలి ప్రజలందఱికిరంజకుఁడయ్యెను. మఱియు నతఁడు విశేష భాగ్యశాలి; ప్రభావంతుఁడు. కావుననే యిప్పటికిని విశేష సంపదగలవారిని సుయోధనసంపత్తి గలవారని చెప్పుచుందురు. తనభార్యయగు భానుదేవియం దనురాగము మెండుగా గలవాఁడు; పరస్త్రీ వర్జితుఁడు.

అతఁడొనర్చిన యుద్ధ మెప్పుడును నధర్మ యుక్తము కాదు. భారత యుద్ధమున నతఁడు తమ్ములఁ దనయుల బంధు జనుల నాప్తుల నందఱం గోలుపోయి తానుగూడ నలసి విశ్రాంతికై ద్వైపాయనహ్రదమునఁ దల దాఁచుకొని యుండఁగా బాండవు లతనిజాడ చారులవలనఁ దెలిసికొని, యతని యడుగులయందలి పద్మ రేఖలంబట్టి యతఁడా చెఱువున డాగెనని కనుఁగొని, యతనిని బలువిధములగు సూటిమాటలాడి యీవలకు రావించిరిగదా! అయ్యెడ ధర్మ స్వరూపుఁడగు ధర్మరాజే యిట్లులనెను. "కురురాజా! పెక్కు భూపతులు సేవింప భూమండలము నిరంకుశముగ నేలితివి. పరాక్రమసంపన్నుఁడవై నేఁటివఱకు సమరముం జరిపితివి. ఇప్పుడీ పిఱికితనము నీకుఁ దగునా? క్షాత్రధర్మమా? ప్రాణముకంటె మానమెక్కుడని యెఱుఁగవా? జయాపజయములు దైవాధీనములు. యుద్ధమునకు రమ్ము. నీవే మమ్ము గెల్తువేని

రాజ్య మనుభవింపుము. లేక యోధుడు వేని చచ్చి వీర స్వర్గముంగొనుము".

ఆ మాటలకు దుర్యోధనుఁడు హ్రదములోనుండియే యిట్లని యుత్తర మిచ్చెను. "పాండవాగ్రజా! నేను మిమ్ముఁ జూచి జడిసి యిట్లు దాగలేదు. యుద్ధమునఁ జాల నలసి యుంటచే, నించుక విశ్రాంతి గైకొనియుంటిని. నేటికి మీరుకూడ విశ్రాంతిఁగొనుఁడు. రేపు సమర మొనర్పవచ్చును.

అందునకు ధర్మరా జేమి యుత్తరము పల్కెనో చూడుడు. "ఇంతవఱకు విశ్రమించిన కాలము చాలదా? పదుమూఁడేండ్లు విశ్రమించియే యిక్కడకు వచ్చితిమి. ఇఁక బయటికి రమ్ము."

దానికి రారాజిట్లు మార్వలికెను. "ఓయీ! నేనిరాజ్య మెవ్వరికొఱకుఁ గాంక్షించితినో యట్టికుమారులును, నాకై యాత్మార్పణముం గావించిన బంధుమిత్రులును మడిసిరి. ఇఁక నెవ్వరికొఱకీ పోరాటము సాగింతును. నాకు నాయను వా రెవ్వరును లేరు. నీకు ముఖ్యబంధువులు గలరు. కావున నీవే రాజ్యమేలుకొనుము. నేను దాపసవృత్తిమై వని కేగుదును. పీనుఁగుల పెంటయగు రాజ్యము నీతల నే కట్టుకొనుము. వైభవములన్నియు నీవే యనుభవింపుము." అందునకు ధర్మరాజు "ఓయీ! నీవు రాజ్యమిచ్చువాఁడవు, నేనుబుచ్చుకొనువాఁడను నగుదునా? క్షత్రియులు దానముం గొందురా! అదిగాక నాఁడు కృష్ణునితో నీవేమాడితివి? సూదిమోపినంత నేల

మైన నీయనని కాదా? ఇప్పుడా పోటుమాట లేమైనవి? నీమాటలతో మాకుఁబనిలేదు. నిన్నుఁ జంపి మఱి నీరాజ్యముం గొందుము, రమ్ము, క్షాత్రతేజముం జూపుము" అనెను.

సుయోధనుఁడస్త్రశస్త్ర రహితుఁడను, మిత్రబాంధవ విహీనుఁడనగు నేనెట్లు సమర మొనర్చుట? యన ధర్మరాజు కావలసిన యస్త్రశస్త్రముల నిత్తునని పలికెను. అప్పుడు రారాజు ప్రహ్లాదంబు వెలువడి భీమునితో గదాయుద్ధమునకు సన్నద్ధుఁడయ్యెను. పాండవులు, కృష్ణుఁడు వారి సమరముం జూచుచుండిరి. ఆ సమయమునకు బలరాముఁడుకూడ వచ్చి తన ప్రియశిష్యుని కయ్యమూరయుచుండెను. భీమసుయోధను లిరువురు నొకరి నొకరు తీసిపోక పోరుచుండిరి. అట్టితఱిని కృష్ణప్రేరితుఁడై యర్జునుఁడు తన తొడపై నప్పళించికొని భీమునకు సైగఁజేసెను. ఆ సంజ్ఞయందలి యర్థము గ్రహించి భీముఁడు సుయోధనుని తొడ విఱుగఁగొట్టి నేలఁగూల్చెను. అది కేవల మక్రమమని బలరాముఁడు కోపించి హస్తినాపుర మును దన నాఁగలితోఁ బెకలించి సముద్రమునఁ గలిపి వేయుదు ననెను. కాని కృష్ణుఁడతనికిఁ దగినరీతి ప్రత్యుత్తర మిచ్చి యతని కినుకఁ బోగొట్టెను.

ఊరుహతుఁడై పడియున్న రారాజునొద్దకుఁ గృపాశ్వ త్థామలు, కృతవర్మయు వచ్చి చూచి మిగుల దుఃఖించిరి. అశ్వత్థామ పాండవులం జంపి యతని కా శుభవార్తఁ దెలిపెద నని చెప్పి కొంతవడికుఁ గార్యసాఫల్య మొంది వచ్చి యా

వార్త రారాజు చెవినివైచి సంతోషపెట్టెను. అతఁడశ్వత్థామయందు దనకుఁగల కృతజ్ఞతం దెల్పెను.

పాప మా మహాభోగి, మహదైశ్వర్యసంపన్నుఁడు, మహారాజ్యరమాధురంధరుఁడు దిక్కుమొక్కులేక, యేకాకియై యంధులగు జననీజనకులకొఱకు దుఃఖించుచుఁ దాను గోల్పోయిన బంధుమిత్రాదులఁగూర్చి తలపోసి విలపించుచుఁ బ్రాణములు విడిచిపెట్టెను.

అతనియందుఁగల ప్రధానదుర్గుణ మీర్ష్యయే. అదియే యతని పతనమునకు మూలము. కాని యతఁడు విశేష పరాక్రమవంతుఁడు, ధర్మపరాయణుఁడు, పరోపకార లోలుఁడు అని చెప్పుటకు సర్వవిధముల నర్హుఁడు.

---

# 6. శ్రీకృష్ణుఁడు

శ్రీకృష్ణుఁడు పాండవులకు మేనత్తకొమరుఁడు. అతని చరిత్ర మత్యద్భుతమైనది. ప్రకృతపు హిందూదేశనాగరకత కంతకు శ్రీకృష్ణుఁడే మూలకారణమని చెప్పవచ్చును. కృష్ణుఁడే యవతరింపకున్న మన దేశములో సంగీతమునకు, యోగికవిద్యకు, రాజనీతికి నింతటి వికాసము రానేరదు. భక్తి శృంగారములు, నీతి వైరాగ్యములు నింతగా నైక్య మందుట యతని మూలముననే; మధురభావమున కంతకును నతఁడే పట్టుఁగొమ్మ యనవచ్చును. అట్టివాని చరిత్రము

సమగ్రముగా వ్రాయబూనిన నదియే యొక గొప్ప గ్రంథ మగును. ఇందతనికి భారతవీరుల కెంతవఱకు సంబంధము గలదో యతఁడు భారతయుద్ధకాలమునఁ బ్రయోగించిన తంత్రాద్యాయుధము లెట్టివో యవి మాత్రమే తెలుపఁ బూనితిని.

పాండవు లెచ్చటనో పర్వతప్రదేశమునఁ బుట్టి కొన్ని యేండ్లదాఁక నక్కడనే పెరుఁగుటచేత శ్రీకృష్ణుఁడు వారితోఁ జిన్ననాఁటనుండియుఁ బరిచయ మొందియుండ లేదు. అదిగాక యతఁడు ధర్మరాజుకన్న వయస్సున జిన్న. పాండవులకును నీతనికిని బ్రథమసమావేశము ద్రౌపదీ స్వయంవరకాలమున జరిగినది. అప్పుడే యొండొరులు చుట్టఱికముం బ్రకటించుకొనిరి. అదిమొదలు వారును నీతఁడును దఱుచుగాఁ గలిసికొనుచుండిరి.

పూర్వకాలమున నరనారాయణులను నిరువురు పురాణ మునులయందు విష్ణ్వంశజొచ్చినది. ఆ మునులు బదరికాశ్రమమున శివునిఁగూర్చి తప మొనరించిరి. ఆ మునిపుంగవులే యర్జున కృష్ణులుగ జన్మించిరి. అక్కారణ మున గృష్ణార్జునుల కత్యంత మైత్రిఁగలిగెను.

పాండవులును గౌరవులును రాజ్యము బంచుకొని, యొక రింద్రప్రస్థపురమున నింకొకరు హస్తినాపురమునను బరిపాలించుచుండిరి. పాండవులు పరస్పర మైత్రిచేతను, శ్రీకృష్ణ సహాయముచేతను, నూపరక్షేత్రములను సుక్షేత్ర

ఖండ్రికలుగాఁ జేసి రాజ్యవిస్తీర్ణముఁ జేసికొనఁ గల్గిరి. అర్జునుఁడు కృష్ణుని తోడ్పాటుచేత ఖాండవవనము దహింపఁ జేయగల్గెను. ఖాండవదహనముచేతనే మయుఁడు పాండవులకు నపూర్వ శృంగారవైభవ యుక్తమగు సభను నిర్మించి యిచ్చెను.

మయసభావైభవ కారణముననే నారదుఁ డితర లోకములలోని సభలను వర్ణించుటయు, నందు యమలోకములోఁ గుందుచున్న పాండురాజు నవస్థ ధర్మరాజునకు నివేదించుటయు, ధర్మజుని రాజసూయయాగముం జేయ నుపదేశించుటయుఁ గల్గినది. ఆ యుపదేశముం బురస్కరించుకొనియే కృష్ణుఁడు సహాయుఁడుగాఁ బాండునందనులు నానా దేశాధీశ్వరులం జయించి కప్పముంగొని యఖండ వైభవముతో యాగమును నిర్వర్తింపఁ గల్గిరి. ఆయాగమే పాండవకౌరవ మాత్సర్యములకు నంకురమైనది. ఏలయన నందు భీష్ముఁడు శ్రీకృష్ణుని మహిమ యెఱింగినవాఁ డౌటచే యజ్ఞారంభమున నర్ఘ్యమతనికే యిమ్మని ధర్మరాజున కుపదేశ మిచ్చెను. ధర్మజుం డట్లొసీయఁగా, శిశుపాలునకుఁ గోపమువచ్చి కాఱులాడెను. కృష్ణుఁడు వానినిఁ జక్రప్రయోగముచేఁ జంపి తన మహత్త్వభావముచేఁ దక్కుంగల శిశుపాలపక్షము వారినెల్ల నిర్వీర్యులంజేసెను. మఱియు దుర్యోధనుఁ డా సభానిర్మాణ రహస్యములం దెలియక తబ్బిబ్బులుపడి యవమానమొందె. పాండవులయెడ నీర్ష్యవహింప దొరకొనెను. కావున

గౌరవ పాండవ విరోధాంకురము నాటినవాఁడు కృష్ణుఁడే యనవచ్చును.

జూదమునందోడి పాండుసూను లరణ్యవాసముఁ జేయుతఱి వాసుదేవుఁడు వారినిఁ గంటికి ఱెప్పవోలెఁ గాపాడి యర్జునునికీర్తిప్రతాపములు, ధర్మరాజు ధర్మగుణము, భీమాదుల భ్రాతృస్నేహము మున్నగునవి లోకమునకుం బ్రకటింపఁజేసెను. ద్రౌపదికి నిండుసభలో మానభంగము గలుగనైయుండఁ దన దివ్యప్రభావముచేతనే కృష్ణుఁ డామె శోక లక్ష్యముం గావించి సోదరిమానముం గాచెను. అరణ్య సంచారము చేయుచున్న పాండవుల కెట్టితఱి నేమి కావలసినను శ్రీకృష్ణుని మహిమయే సాయపడినదని చెప్పవచ్చును.

అజ్ఞాతవాసానంతరమున శ్రీకృష్ణుఁడు పాండుకుమారులతో మంతనముసల్పి కౌరవసభకు రాయబారిగా నేఁగి యచటఁదన యమానుషశక్తులుగనఁబఱచితానుభగవంతుఁడగుట లోకవిశ్రుతిఁగావించెను. ఆకాశావకాశములనిండ మహాతేజస్వంతమైన తన విశ్వరూపమును గొందఱు భక్తులకే కాక యంధుఁడగు ధృతరాష్ట్రునికిఁ గూడఁ జూపి వారిం దరింపఁజేసెను. తన రాయబారమువలన గౌరవులు లొంగకపోయినను, వారి మర్మములన్నియు గ్రహించి పాండవులకు జయ మాపాదించుమార్గ మాతఁ డరయగల్గెను. కౌరవరాజు కృష్ణు నా రాయబారసమయమున మాయోపాయమున మడియింపఁ దలపెట్టఁగా, మాయాతీతుఁడై మాయలను మాయ

చేయువాఁడగు నతఁడాతని యుద్దేశ్యముం గ్రహించి యా రారాజు నాతిథ్యముం గొనక యతని, నతనిసభ్యులను విమోహితులను విభ్రాంతులను జేసి వచ్చెను.

కృష్ణుని భక్తపరాధీనత మిగులఁ బ్రశంసనీయము. రాయబారపువేళ దుర్యోధనుఁ డతనికి గొప్ప యాతిథ్య మీయ సమకట్ట నాతఁడు దాని నంగీకరింపక విదురునింట నల్పాహారముం గొనుటకే యంగీకరించెను. ఏలయన విదురుఁ డతనియెడఁ జాల భక్తిగలవాఁడు. యుద్ధము నిశ్చయింపఁ బడినతర్వాత నతని సాయమపేక్షించి దుర్యోధనుఁ డతని కడకు రాఁగాఁ గృష్ణుఁడు దొంగనిద్దురవోయి యర్జునుఁడు వచ్చువఱకుజాగుచేసెను. దుర్యోధనుఁడుకృష్ణుడుమేల్కాంచు వఱకుఁ గూర్చుండుట మేలని తలంచి యతని తలయంపిదెస నున్న యాసనముపై నాసీనుఁడయ్యెను. కొంతసేపటి కర్జు నుఁడును వచ్చెను. అతనికి వేఱొండాసనము కృష్ణుఁడమర్చి యుండకపోవుటచేతను, నతనికి, కృష్ణునకు మానసికముగా నభేదత్వమే యొప్పుచుండుటచేతను, నర్జునుండు బావ పాన్పుమీఁదనే యతని కాళ్ళదగ్గఱఁ గూర్చుండెను. కొంత వడికిఁ గృష్ణుఁడుమేల్కొనినట్లు నటించి ముందుగా నెదుట నున్న నర్జునునిఁగాంచి కుశలప్రశ్న మొనర్చి వచ్చినకార్యంబుఁ గ్రుచ్చి యడిగెను. అర్జునుం డతని తోడుపాటు సమరంబునం దపేక్షించి వచ్చితినని చెప్పెను. వెంటనే దుర్యోధనుఁడును "బావా! నేనుగూడఁ దత్కార్యార్థమై యే వచ్చితిని. ఫల్గు నునికంటె ముందుగా వచ్చితి. రణమున నీవు నాకే తోడ్పడ

వలయు” ననెను. అందునకు నందనందనుఁడు “మీారిరువురు బాంధవ్యముచే నాకు నొక్కరూప కాని నేను ముందుగా నర్జునుని జూచితి. కావున నతనికే నేను తోడ్పడవలయును కాని నీవు వానికన్న మున్న యేతెంచితినని చెప్పితివి గావున నీకును దోడ్పడవలసిన ధర్మంబు గలదు. కనుక నే నిప్పుడొక యుపాయముం జెప్పెద వినుఁడు. నేను నిరాయుధుఁడనై యుద్ధమొనరింపకయే యొక పక్షమున నిల్తును. సమర భీములగు పదివేవురు గోపాలురొక పక్షమున నిలుచునట్లు చేయుదును. నేనుగావలెనో యీా పదివేల గోపాలశూరులు కావలెనో మీారు నిర్ణయించుకొనుఁడు. మీా యిరువురిలో నర్జునుఁడు చిన్నవాఁడు గనుక, నతనికే మొదట నెన్నుకొను స్వాతంత్ర్య మీాయవలెఁగదా! కావున ముందతఁ డెన్నుకొనునుగాక. ఆవల రెండవపక్షము నీవే కైకొందువు” అని పల్కెను. అర్జునుఁ డత్యానందముతో నిరాయుధుఁడగు కృష్ణుని యెన్నుకొనెను. దుర్యోధనుఁడు తనకులభించిన పశుబలపూరితులగు పదివేవురు గోపాలురే యెక్కువ మేలనియూహించి తృప్తితోఁజనెను. అంతగృష్ణుఁ డర్జునునితో “బావా! నిరాయుధుఁడను, యుద్ధప్రారంభ రహితుఁడను నగు నన్నేల యెన్నుకొంటి” వని యడిగెను. అర్జునుఁడు “మహాత్మా! నీవు దైవమవు. నాకు దైవబల సహాయము కావలయుఁ గాని, పశుబలసహాయ మక్కఱ లేదు. నీవున్నచోట జయముండునుగాని వేఱొండుచోట నుండదు. కావున నిన్నే కోరితి” నని యతఁడు బదులు పల్కెను. కృష్ణుఁడాతని భక్తికి మెచ్చి యానందమొందెను.

యుద్ధారంభమున నర్జునుఁడు సోదరులును, నితర సమీప బంధువులును నగు కౌరవులతోఁ బోరుట కిష్టపడక, సంకోచింపగా కృష్ణుఁడప్పుడు మహత్తరమైన రాజనీతిఁ దెల్పి యతనిని సమరమునకుఁ బురికొల్పెను. ఆ నీతిబోధం దెల్పు భారతభాగమే భగవద్గీత యనఁబడు నత్యుత్కృష్ట గ్రంథ రాజమై వెలయుచున్నది. యుద్ధములో భీష్ముఁ డుద్రేకింపఁగా నర్జునుఁడు భీతిఁజెందెను. కృష్ణుఁడు తన భక్తుఁడైన క్రీడి భయముఁ బాపఁ దా నాయుధము పట్టననియొనర్చిన సమయముం దప్పి, చక్రము చేతఁబట్టి భీష్మునిం జంపనుంకించెను. భీష్ముఁడు కృష్ణుని భక్తత్రాణపరాయణత్వమునకు సంతసించి "మహాత్మా! నీ చేతిలోఁ జచ్చుటకంటె నాకుఁ గావలసిన దేమికలదు. సమయభంగము గావించి నీవు చక్రముంబట్టుట కేవల భక్తత్రాణ పరాయణతయే?" యని పలుక గృష్ణుఁడించుక లజ్జపడినట్లు నటించి వెనుకకు మఱలెను. ఇవియెల్ల నతని లీలలు. అతఁ డారీతి నాచరింపకున్నఁ బాండవ సైన్యములును వానితోఁబాటు ఫల్గునుఁడును నిరుత్సాహపడి వెన్నిచ్చి పాఱిపోయి యుందురు.

పద్మవ్యూహముం జొచ్చిన యభిమన్యుఁ డన్యాయముగా సైంధవుండడ్డువచ్చుటచేత వధింపఁబడగా, నర్జునుఁడు మఱునాఁటి సూర్యాస్తమయములోపలఁ దత్సైంధవుని మడియింతుననియు, నటుల జేయకున్న జిచ్చుఱికెదననియుఁ బ్రతిజ్ఞఁజేసెను. మఱుచటిదినమునఁ గౌరవులు జయద్రథుని బయటికిరానీక దాఁచిరి. అప్పుడు శ్రీకృష్ణుఁడు చక్రప్రయో

గముం జేసి యకాలసంధ్యఁ గల్పించి కౌరవులం భ్రమింపఁ జేసి సింధురాజు సీవలకురప్పించెను. అదియె తగినయదనని యెంచి పార్థుఁడు వాని శిరంబుం గొట్టి తన ప్రతిజ్ఞ నెఱవేర్చు కొనెను. వాసుదేవుని సాహాయ్య సంపత్తియే లేకుండిన యర్జునుఁడు చిచ్చుఱకవలసివచ్చునుగదా!

ద్రోణకర్ణాదు లర్జునునిపైఁ బ్రయోగించిన తీవ్ర బాణంబులన్నియుఁ గృష్ణుఁడు తానే భరించుటచేత నేకదా క్రీడికి కీడును కలుగకుంట? యుద్ధానంతరమునఁ గృష్ణుఁ డర్జునునే ముందుగా రథావరోహణముం జేయుమనియావలఁ దానొనర్చెను. అంతరథమస్త్రాగ్నులచే నాహుతియయ్యెను. మఱియు నశ్వత్థామ ప్రయోగించిన యపాండవాస్త్రం బుత్తరాగర్భంబు ఛేదింపకుండఁ గాపాడి పాండవ కౌరవ కులాంకూరునిఁగాఁ బరీక్షిత్తుని వెలయఁజేసిన దా శ్రీకృష్ణుని దయాప్రభావమేకదా! ఇట్లు పాండవులశ్రేయోభివృద్ధి కెల్లఁ గృష్ణుఁడు ప్రధాన కారణుఁడు.

అట్టి కృష్ణుఁడు కారణజన్ముఁడగు నొక యెఱుకు బాణహతికి లోనై తన భక్తాగ్రేసరుఁడగు నర్జునుని తొడ మీఁదనే పండియుండి తానీభూమియం దుద్భవించి యొనర్ప వలసిన ధర్మములన్నియు బరిపూర్తిగా నెఱవేర్చితినిగదా యని పరితృప్తిఁజెందు మోముఁదమ్మితో మఱఁదివైపు చూచుచు నిహలోకమును వీడి తన శాశ్వతపదవిం జేరు కొనెను. ఆ మహనీయుని చరిత్ర కడు సంస్తవనీయమైనది.

(5)

# 7. ధర్మరాజు

ధర్మరాజు యముని దివ్యప్రసాదముచేతఁ గుంతికి జనించెను. కావుననే పుట్టుకచేతనే ధర్మగుణమతని కలవడెను. ఆతఁడు పాండవులలో జ్యేష్ఠుఁడు. అతనియందుండు ధర్మగుణ మయస్కాంతమై తమ్ములను నయోమయ పదార్థములను దనవంక కాకర్షించుచుండును. తండ్రి గతించినతర్వాతఁ గుంతి వ్యాసునుపదేశమున ధృతరాష్ట్రుని కడకు వచ్చి యతని పోషణములో నుండఁ జొచ్చెను. హస్తినాపురములో ధర్మరాజాదులు కౌరవకుమారులతోఁ బాటు పెరుఁగుచు సమస్తవిద్యలను నేర్చిరి. ధర్మరాజునందుఁ బ్రజలకందఱికి నపారమైన ప్రేమయు భక్తియుఁ గుదురఁ జొచ్చెను. అది గుర్తించి ధృతరాష్ట్రుఁడతనినే యువరాజుగాఁ జేసెను. కాని దుర్యోధనున కది గిట్టకుండెను. తనకు రావలసిన హక్కు పరునకేల యీయవలెనని కోపము వచ్చెను. ధృతరాష్ట్రునకు పెద్దకొడుకుమీఁద మితిమీఱిన ప్రేమ. ఆ కారణమున వాని మాటలకు లోబడి వాని యుపదేశముమీఁదఁ బాండుకుమారులను వారణాసి కేఁగి పితృకర్మలుచేసి రమ్మని యాజ్ఞ యిచ్చెను. ధర్మరాజు తన తండ్రిగానే యంధరాజును భావించుటచేఁ దల్లితోను దమ్ములతోను బ్రయాణమయ్యెను. కాని యాప్రయాణములోని మర్మ మెఱుంగఁడయ్యెను. అప్పుడు విదురుఁడు ధర్మతత్పరుఁడగుటచేత ధర్మరాజుతో మ్లేచ్ఛభాషను వారికి

రాఁగల యపాయమును గూర్చియు దానిని దప్పించు మార్గమును గూర్చియుఁ జెప్పెను.

ధర్మజుఁడు నిజపరివారముతోఁ గాశికేఁగెను. అందు దుర్యోధనునిచే నేర్పాటుచేయఁబడిన లాక్షాగృహమందు విడిసెను. అక్కడ జరుగవలసిన దాన ధర్మములన్నియు జరిగెను. పిమ్మట రేయి నందఱును నిద్రించు సమయమునఁ దద్గృహమునకు నిప్పంటింపఁబడెను. కాని పాండవులు మున్నె తప్పించుకొనుమార్గ మరసియుంటచేఁ దప్పించు కొనిరి. కౌరవుల పక్షమువారే యగ్ని కాహుతులైరి.

అక్కడినుండి ధర్మరాజు తమ్ములతోను దల్లితోను గూడి యేకచక్రపురమున కేఁగి యచ్చటమధుకరవృత్తిచేఁ గొన్నాళ్ళు జీవించియుండెను. అందుఁగూడఁ దన ధర్మము యథావిధి నెఱవేర్చుచుండెను. అక్కడ భీముఁడు బకాసురుని వధించినపిమ్మటఁ బాండుసూనులు ద్రౌపదీ స్వయంవరమున కేఁగిరి. అర్జునుఁడు మత్స్యయంత్రమును గొట్టి ద్రౌపదిం గొని తెచ్చెను. తల్లికడకు వచ్చి "అమ్మా! మాకొక ఫలము లభించిన" దనెను. తల్లి "నాయనా! మీ యన్నదమ్ము లేవురును బంచికొం"డనెను. ఫలమనగా నుత్తమస్త్రీలాభమని వారు చెప్పినపుడు ధర్మరాజు తల్లి మాట వీటిఁబోవకుండ ధర్మము చెడకుండ ముందునుపాయ మేదని వ్యాసునివలనఁ దెలిసికొని యాద్రౌపది నేవురును బెండ్లియాడునటు లేర్పాటు గావించెను.

లక్కయింటిలోఁ గాలిపోయిరని తలఁపబడిన పాండవు లింకను బ్రతికియే యున్నారని దుర్యోధనునకుఁ దెలిసెను. అంధరాజు లోన నెట్టు లున్నను పాండవులు సజీవులై యున్నందులకు సంతోషించి వారిని మఱలరావించి వారికిఁ దన రాజ్యములో సగమిచ్చెను. ధర్మరాజు ఇంద్రప్రస్థమును రాజధానిగాఁ జేసికొని యఖండ వైభవముతో రాజ్య మేలు చుండెను.

ఒకనాఁడు నారదుఁడు ధర్మరాజు నొద్దకు వచ్చి రాజసూయముచేసి యమలోకములోఁ గుందుచున్న పాండు రాజు శోకము మాన్పుమని యానతిచ్చెను. శ్రీకృష్ణుఁ డనుమతిని ధర్మరాజు రాజసూయము చేయఁదలపెట్టెను. మయుఁ డొక యపూర్వసభ గట్టియిచ్చెను. ధర్మరాజు మహా వైభవముతో రాజసూయ మొనర్చెను. అతని వైభవమును చూచి యెందరో దేశాధీశ్వరులు కృతార్థులైరి. అర్థులకెల్ల కోరికలు దీరెను. బ్రాహ్మణులు భూరిదానములను బొంది తృప్తిఁగాంచిరి. హరిశ్చంద్రుఁ డొనరించిన రాజసూయము కంటెను, ధర్మరాజొనరించినది యెక్కువ వైభవముతోఁ గూడినదని యెల్లవారును బలికిరి. ధర్మజుని సభా సౌందర్య మింద్రసభకైన లేదని నారదాదులు చెప్పిరి. ఆ సభ వలననే దుర్యోధనునకు మచ్చరముపుట్టెను.

దుష్టస్నేహితుల దుపదేశముపై దుర్యోధనుఁడు యమతనూజుని స్నేహద్యూతమునకు రమ్మని పిలిచెను. క్షత్రి

యుఁడు స్నేహద్యూతమునకును, యుద్ధమునకును, బిలువఁబడి నపుడు రానని నిరాకరింపరాదని ధర్మరాజు ధర్మసూక్ష్మ మెఱింగి మాయజూద మాడఁబోయెను. జూదమాడుట యందు ధర్మరాజునకుఁ బ్రావీణ్యము విశేషముగాఁ గలదు. మఱియు నం దాసక్తియు నతనికి మిక్కుటముగాఁ గలదు. ఆవ్యసనాసక్తిచేతనే యతఁడు రాజ్యసర్వస్వ మోడిపోయెను. తాను దమ్ములతోఁ బాటు సుయోధనుని బానిసయయ్యెను. నిండుసభలో దుర్యోధనుఁడును నతని మిత్రులును జెలరేగి యనేక దుర్భాషలాడు నప్పుడు ధర్మమునకుఁ గట్టుపడుట చేతనే, ధర్మరాజు కిమ్మన కూరకుండెను. తన యర్ధాంగ లక్ష్మియగు ద్రౌపదిని దుస్ససేనుఁడు కొప్పుబట్టుకొని సభకీడ్చుకొని రాఁగా, ధర్మమునకుఁ గట్టుపడి ధర్మరాజూర కుండెను. భీమసేనాదు లుద్రేకించుచుండ, వారినివారించి "తమ్ములారా! మనము కాలమునకుఁ గట్టువడ వలెను. మనము పగఁదీర్చుకొను సమయము ముందు వచ్చును. ఇది తగినతఱి కాదు" అని చెప్పెను. అన్నగారి యాజ్ఞకు లోబడియే భీముఁడు కౌరవుల నప్పు డెదుర్కొనక ద్రౌపది కోక లొలిచిన దుశ్శాసనుని యుద్ధములోఁ బొట్టఁజీల్చి ప్రేవు లూడఁబెఱికి నెత్తురు పూసికొని హత మొనర్తు ననియు, దుర్యోధనుని తొడలు విరుగఁగొట్టి చంపుదుననియు బ్రతిజ్ఞఁ బట్టెను. అర్జునాదు లటులే ప్రతిజ్ఞావచనములు బల్కియూరకుండిరి. ద్రౌపది "నాధా! సర్వధర్మము లెఱింగిన వాఁడవుగదా! భార్యనిట్లు లవమానించుచుండ

నూరకుందువా?" యని ధర్మరాజు నడిగినప్పు డతఁడు, "ప్రేయసీ! మేమిప్పుడేమియుఁ జేయఁజాలము. నీ మానముఁ గావ శ్రీకృష్ణభగవానుఁడే గలఁడు. అతనినే యర్థింపు" మనెను. భర్తయుపదేశముపై ద్రౌపది శ్రీకృష్ణునిఁ బ్రార్థించెను. అతని మహిమచేఁ గోకలక్షయము లయ్యెను. కౌరవులు సిగ్గుపడి యూరకుండిరి.

అప్పుడు ధృతరాష్ట్రుఁడు కొడుకుల దుశ్చేష్టలకు సిగ్గుపడి పాండవులరాజ్యము నిచ్చివేసెను. కాని దుర్యోధనుఁడు మఱల జూదమునకు రమ్మని పిలువఁగాఁ గితవాగ్రేసరుఁడగు ధర్మరాజు మఱల సిద్ధపడెను. ఈపర్యాయ మోడినవారు పండ్రెండేండ్లు వనవాసమును నొకయేఁ డజ్ఞాతవాసమును జేయవలయునని యేర్పాటు చేసికొనిరి. ధర్మరాజే యోడెను. కాని ధర్మమునకు బద్ధులగుటచే, వెంటనే మాట నిలువఁ బెట్టుకొనఁదలఁచి రాజ్యమంతయువదలి తమ్ములతోను ద్రౌపదితోను బయలువెడలి యరణ్యమున కేగి యెన్నో యిడుములం బడెను.

తమ్మిట్లడవులం బట్టించెనని దుర్యోధనునిపై ధర్మరాజున కేమియుఁ గోపము లేదు. తమ కర్మఫలమే తమ్మిట్లుకష్టములం ద్రోచెఁగాని మనుష్యమాత్రులు కారకులు గారని యతని నమ్మకము. ఆ విశ్వాసముచేతనే, దుర్యోధనుఁడు ఘోషయాత్రయను నెపమున ద్వైతవనములోనున్న పాండవుల నపహసించుటకువచ్చి గంధర్వరాజగు చిత్రరథునిచే

బంధింపఁ బడి, మీఁదికిఁ గొంపోఁబడు నపుడు, ప్రాతపగలు మాని వానిని బంధవిముక్తినిఁ జేయుఁడని భీమార్జునులను రక్షింపఁబంపెను. భీమాదుల కెంత యుడుకు లోపల నున్నను నన్నమాట కెదురాడని వారగుటచేఁ బోయి దుర్యోధనుని విడిపించుకొని వచ్చిరి. అయ్యెడ ధర్మరా జెంతయో శాంత చిత్తముతోఁ బ్రసంగించి దుర్యోధనుని హస్తినాపురము నకుం బంపెను. ఒకకుటుంబములో నన్నదమ్ములు పరస్పరము పోరుచున్నను, బరులవలన బాధవచ్చినప్పు డొండొరులు సాయము చేసికొనక తప్పదని యతఁడు తమ్ములకు నీతిబోధఁ జేసెను.

అజ్ఞాతవాసమునకు ముందు ధర్మదేవత యొకయక్షుని రూపమునఁ గన్పడి ధర్మములంగూర్చి కొన్ని ప్రశ్నలడుగఁగా వానికెల్ల సదుత్తరముల నీయగల్గినవాఁడు ధర్మరా జొక్కఁడే. అతఁడట్టి సదుత్తరములిచ్చి యాయక్షు నను గ్రహము వడసి శాపవశమున రాలై పడియున్న తమ్ములను బ్రతికించి, రాఁగల యజ్ఞాతవాస దీక్షకుఁ దగిన గోప్యరూపములను దనకుఁ దన సోదరులకును బడయగల్గెను. అతని ధర్మశీలత యెంత లెంతలైనఁ జేయఁగల్గెను.

పిమ్మటఁ దామందఱు విరటుని కొలువునకు బోయిరి. తానుబ్రాహ్మణవేషమునుధరించి కంకుభట్టనునామముఁదాల్చి విరటునితో వినోదలీలఁ బాచికలాడుచుఁ బురాణగోష్ఠి సలుపుచు నుండెను. భీముఁడు వంటలవాఁడై వలలుండనుపేరుతో

నుండెను. అర్జునుఁడు పేడిరూపముఁ దాల్చి బృహన్నలయను పేరుతో నుత్తరకు నాట్యవిద్య నేర్పువాఁడై యుండెను. నకులుఁడు దామగ్రంథి యను నభిధేయముతో నశ్వశిక్షకుఁడై యుండెను. సహదేవుఁడు తంత్రీపాలుఁడని పిలువఁ బడుచు గోశాల కధ్యక్షుఁడై యుండెను. ద్రౌపది మాలిని యను నామమున సైరంధ్రీవృత్తిని వర్తించెను. ఇట్లుండఁ బాండవులు విరటుని కొలువున నున్నట్టు కౌరవులనుమానించి, మత్స్య దేశముపై దండెత్తివచ్చి, యుత్తర దక్షిణ దిక్కులందున్న గోవులం బట్టిరి. అప్పుడుత్తర దిశకు నుత్తరకుమారుఁడు బృహన్నలను సారథిగాఁ దీసికొని యేగెను. కాని కౌరవదళముంజూచి భయపడెను. అప్పటి కజ్ఞాతవాసదీక్షా కాలము ముగియుటచేత నిఁక రహస్యమక్కఱలేదని యూహించి బృహన్నల తానే యర్జునుఁడనని యుత్తరునకు నచ్చజెప్పి యతనిని సమరమునకుఁ బురికొల్పఁ జూచెను. కాని యుత్తరుఁ డతిభీతుఁడై పాఱిపోఁజొచ్చెను. అర్జునుఁడు వానిని సారథిగాఁ దీసికొని తానే రథికుఁడై కౌరవుల నోడించెను. కాని యుత్తరునితోఁ దన్నుఁగూర్చి యెవరికిని దెలియనీయవలదని చెప్పి పురిజేరెను. విరటుఁడును గంకుఁడును బాచికలాడుచుండ నుత్తరుని జయప్రశంసరాగాఁ గంకుభట్టు బృహన్నల మూలముననే జయమబ్బెననియు నుత్తరునకుఁ గౌరవులనోడించు ప్రజ్ఞయుండుట కష్టమనియుఁ జెప్పెను. ఆ మాటలకు విరటుఁడు కోపించి పాచికలతోఁ

గంటునిఁగొట్టెను. ఆదెబ్బచే నెన్నుదుట నెత్తురుకారెను. అది మాలిని యొత్తెను.

అట్టి యవమాన సమయమునఁ గూడ ధర్మరాజు నిరుపమాన శాంతగుణమును జూపెను.

యుద్ధమునకు ముందు కృష్ణుని రాయబారిగాఁ గౌరవ సభకుఁ బంపి తమ రాజ్యమిచ్చినను సరియే, యటులగాకున్న నేవురకు నైదూళ్ళిచ్చినను జాలుననియు సోదరవర్గముతోఁ బోరొనర్చుట తన కెంత మాత్రము తలఁపులేదనియు జెప్పి పుచ్చెను. కాని కార్యము కాకపోయెను.

యుద్ధములో నతఁడుచూపిన రాజనీతి మిగులఁ గొని యాడఁదగినది. అతఁడు ఖడ్గముబట్టి తీవ్రతవహించినప్పుడు జయమేకల్గెను; కాని యోటమికల్గలేదు. కర్ణునిచేత, మఱి కొందఱు కౌరవవీరులచేత నతఁడు పలుసారులు తీవ్రముగా గాయపఱుపఁబడెను. కాని యెన్నఁడును గినుకఁ జెందలేదు. స్థిరత్వము వీడలేదు. కావుననే యతనికి యుధిష్ఠిరుఁడను సార్థకనామ మిడఁబడెను.

అతనియందుఁ జూపట్టు లోపము ద్రోణవధసమయ మున నాడిన యనృతమే. అందున కతఁడు తగిన ఫలమును గడపటఁబొందెను. శల్యునిఁ జంపునపుడు ధర్మరాజు చూపిన యసమానశౌర్య మెంతయు స్తుతిపాత్రము. మఱియు నతఁడు శత్రుశేష మశేషయే" త్తను నీతిని బాటించియే హ్రదము నందు దాఁగిన దుర్యోధనునిపైఁ గించి దనుకంపయేని పూనక యీావలకు రావించి చంపించెను.

రాజనీతినిఁ బాటించి యిట్లు బంధుమరణము ఘోరముగా గావింపవలసి వచ్చినందున కతఁడావల నెంతో పశ్చాత్తాపపడి శ్రీకృష్ణునిచేత, వ్యాసునిచేత నంపశయ్యపై బండియున్న భీష్మునిచేతం బెక్కునీతుల నేర్చుకొని, పిమ్మట సింహాసనమధిష్ఠించి, చల్లగ నేలనేలి, యావల నభిమన్యునకుత్తరయందుఁబుట్టిన పరీక్షిత్తునకుఁ బట్టముఁగట్టి, వైరాగ్యవృత్తితో సర్వసంగములఁ బరిత్యజించి, హిమాలయమునకేగి, యచ్చటినుండి యామేనితోడనే స్వర్గమునకుఁబోయెను. అతఁడొక్క యబద్ధమాడినందున నాతనిని నరకముగుండ స్వర్గమునకు దేవదూతలు గొనిపోయినట్లు పెద్దలు చెప్పుదురు. కావున యుధిష్ఠిరుని చరిత్ర పరమపవిత్రమైనది.

# 8. భీముఁడు

భీముఁడు కుంతికి వాయుప్రసాదమునఁ బుట్టిన కుమారుఁడు. ఇతఁ డనంత భుజబల సంపదఁగలవాఁడు. చిన్ననాఁడీతఁడు కురుకుమారులతో నాడుకొనుకాలమునఁ బిల్లలకుఁగల్గు కలహములయందుఁ గురుసంతతినంతను నెదుర్కొని పోరి జయమందుచు వచ్చెను. అందు ముఖ్యముగా దుర్యోధనునితో సదా పోరాడి గెల్చుచు వచ్చెను. అదియే కౌరవరాజునకుఁ బాండవులయెడ మొదటి క్రోధకారణము.

కురుకుమారులు భీముఁడు చేయు దుండగములకుఁ గోపించి యొకనాఁ డతనికి విషాన్నముఁ బెట్టించిరి. ఆ విష

మతనిని జంపజాలకపోయినను, మూర్ఛ పోనొట్టఁగలిగెను. ఆరీతిగా నొడలు తెలియక పడియున్న భీముని దీఁగలతోఁ గట్టి కౌరవు లొక మడువులోఁ బడవైచిరి. భీముఁ డందు మునిఁగి పోయి నాగకన్యలచేఁ బాతాళలోకమునకుఁ గొని పోఁబడెను. ఆ కన్నెలతని బాహుబల తేజంబులఁ జూచి యాశ్చర్యపడి వాని శరీరమున కెక్కిన విషమంతయు లాగి వైచి యతనిని మూర్ఛనుండి తేర్చిరి. అతఁడిట్లు సురక్షితుఁడై నాగలోక కాంతలవలన బయటికిఁ గొనిరాఁబడెను.

వారణాసియందు లక్కయిల్లు గాలునప్పుడు భీముఁడే సోదరులను దల్లిని నేలలోఁ ద్రవ్వబడిన బొఱియగుండ నొక యరణ్యమునకు జాగరూకతతోఁ గొనిపోయెను. అక్కడ తన వారినెల్ల నిదురఁబుచ్చి తానే కావలిఁగాచుచు రేయెల్ల మేల్కనియుండెను. అప్పు డా వనమందున్న హిడింబుఁడను రక్కసుఁ డొక్కడు మానిసి పసిగట్టి వానిని బట్టితెమ్మని తన చెల్లెలగు హిడింబను బంపెను. హిడింబవచ్చిచూడ నొక మహాబలుఁడు కొందఱు నిద్రించుమనుష్యులకుఁ గావలి గాచుచుండుటగాంచెను. ఆమె యాతని సౌందర్యమునకుఁ దేజస్సునకు మోదమంది యాతనిపై మోహము నిల్పెను. తాను యథారూపముతో నాతనికడకేఁగుట మంచిదికాదని యెంచి, యొక చక్కనిమనుష్యాంగనవలెవచ్చి భీముని సమీపించి తనవలపును దెలిపెను. మనుష్యులను దనకాహారముగాఁ దెచ్చుటకేఁగిన చెల్లెలెంతకును నిలయమునకు రాక పోవుటచే హిడింబుఁడుకోపించి తానేబయలు వెడలివచ్చెను.

అప్పుడతనికి మనుష్య రూపముతోనున్న సోదరియు నొక యువకుఁడును గాన్పించిరి. వాని కెంతేని కోపము వృద్ధియై యాయిరువురపైఁబడెను. అక్కడనే యుద్ధముజరిగిన సోదరులకు నిద్రాభంగమగునని యూహించి భీముఁడు వానిని దూరముగాఁ గొనిపోయి చంపెను. అంతగుంతి యనుమతి మీఁద భీముఁడు హిడింబను భార్యగాగ్రహించి యామెవలన ఘటోత్కచుఁడను కుమారునిం బడసెను.

అక్కడనుండి పాండవు లేకచక్రపురమునకుఁ బోయిరి. వారక్కడ నొకబ్రాహ్మణుని యింటనుండి మధుకరవృత్తిచే జీవించుచుండిరి. కుంతి కొడుకులందఱును దెచ్చినభోజ్యపదార్థములన్నియుఁ బ్రోవుచేసి దానిలో సగము భీమునికిని దక్కిన సగము కడమవారికిని బంచి యిచ్చుచుండెడిది. ఆపురసమీపారణ్యమున నొక రాక్షసుఁడు బకుఁడనువాఁడు గలఁడు. వానికి బ్రతిదిన మొక మానిసియు నొకబండెఁడన్నమును రెండెనుఁబోతులును నాహారముగాఁ బురవాసులు పంపుచుండెడివారు. ఒకనాఁడు పాండవులు వసించియున్న యింటివారిలో నొకఁడు వాని కాహారముగాఁ బోవలసిన వంతు వచ్చినది. వారిలో నొక్కొక్కరు నేను నే నని వంతులు తెగక బాధపడుచుఁ దమకుఁ గల్గిన యపాయమునకు మిగుల వగచుచుండ భీముఁడు తానేగి యారక్కసుని మడియించి వత్తునని చెప్పి యాహార పదార్థములు పట్టుకొని వెళ్ళుచు దారిలో నా పదార్థము లన్నియుఁ దానే భుజించి యాఁ

యసురుని యుసురులుగొనెను. ఊరివారందఱు తమకు భీముఁడు చేసిన యుపకారమున కాతని వేనోళ్ళఁ గొనియాడిరి.

పిమ్మటఁ బాండవులు హస్తినగరమునకుఁ బోయి రాజ్యము పంచుకొని యుండఁగా ధర్మజుఁడు రాజసూయ మొనర్పఁ బూనెను. అప్పుడ జేయులని తలఁపఁబడెడు రాజుల నందఱిని జయించుటకుఁ బాండవులు తలకొకదిక్కున కేఁగిరి. వారిలోఁ గృష్ణార్జునులును భీముఁడును గిరివ్రజపురము నేలు జరాసంధుని కడకుఁ బోయిరి. భీముఁడు జరాసంధుని నెక్కటి కయ్యమున వానిం జంపి వానిచేఁ జెఱలో నుంపఁబడిన రాజ పుత్రుల నందఱిని విడిపించెను. ఈరీతిగా నన్నగారియజ్ఞమున కడ్డంకిగానుండు ముఖ్యశత్రువులను భీముఁడు సంహారము మొనర్చి యా రాజసూయమును నిర్విఘ్నముగాఁ గొన సాగించెను.

ద్రౌపదికోకలొలుచునప్పుడు ధర్మజుని యాజ్ఞాబద్ధుఁడై యూరకుండెనుగాని, లేకున్న నతఁడు కౌరవులనెల్ల నాసభ యందే మడియించియుండును. అరణ్యవాసము చేయునప్పుడు భీముఁడు ద్రౌపదియు లీలావిహారము చేయుచుండఁగా సౌగంధిక మనఁబడు వింత పరిమళంపు బుష్ప మొకటి వాయు వశమున వచ్చి వారి ముందుపడెను. ద్రౌపది యట్టివి తనకుఁ గావలయునని కోరెను. భీముఁడాగాలిజాడఁబట్టిపోయి యా వింత తామరయున్న తటాకమునకై వెదకుచుండ, దారిలో నొక ముసలికోఁతి యడ్డముగాఁ బండుకొని యతని గమనము

నరికట్టైను. అతఁడవు డొక పెద్ద బొబ్బరింత చేసెను. దాని కా కోఁతి కొంచె ముల్కిపడి మేల్కనినట్లు నటించి "ఓయీ ! నీ వెవఁడవు ? నావంటి ముసలిజంతువుల నిట్లు భయపెట్టి మేల్కొలుపదగునా?" యని యడిగెను. అందుల కాతఁడు "వాయుప్రసాదమునఁ గుంతికి బుట్టినవాఁడను. ధర్మజుని తమ్ముఁడను. నే నొక కార్యార్థమై పోవుచుండ నీవు దారిలో నా కడ్డముగాఁ బండుకొంటివి. కావున మేల్కొలిపితిని. తప్పా" యనెను. అప్పు డాకోఁతి "నాయనా! నేను లేవలేను. నా తోఁక నావలికిఁ ద్రోసికొని నీ వేగుము. బొత్తుగా నీరసముగా నుంటి" ననెను. భీముఁ డామల్లుతోఁక కాలితోఁ ద్రోయఁ జూచెను. అది కదలలేదు. రెండు చేతులతోఁబట్టి త్రోయ నెంచియు వ్యర్థమనోరథుఁడయ్యెను. ఈతఁడెవ్వఁడో మహానుభావుఁడై యుండనోపు నని తలంచి "మహాత్మా ! నా బలగర్వ మడంగినది. నీవు కేవలము భగవానుఁడవో, లేక రామ సేవకుఁడవైన నాసోదరుఁడవగు హనుమంతుఁడవో చెప్పి నాయపచారమును మన్నింపు" మని వేఁడెను. కోతి యాతనియందుఁ బ్రసన్నయై "నేను నీవనిన హనుమంతుఁడనే. నీవినయవాక్యములు నామది కెక్కినవి. నీ కార్యము సిద్ధించును పొమ్ము. ముందు మీకును గౌరవులకును సమరము గలుగు నప్పుడు నేను నరుని రథకేతనముపై నిల్చియుండి మీకుఁ దగిన సాయము చేయుచు మీ శౌర్య ప్రకటనమును జూచి యానందించెద" నని చెప్పి యతని కా పుష్పములు లభించు మార్గముం జెప్పిపుచ్చెను. భీముఁడా

సౌగంధిక సరస్సుకడకుఁ బోయి యచ్చటి కాసారపాలకు లగు యక్షులను జయించి తనకుఁ గావలసిన పూలను గోసికొనివచ్చి ద్రౌపదిముచ్చట దీర్చెను.

అజ్ఞాతవాసకాలమున భీముఁడు వలలుఁడను పేర విరటుని వంటలవాఁడై యుండెను. అప్పుడు కౌరవులు పాండవులను గనుఁగొనుటకుఁ గొంతమంది మల్లులను నానారాజసభలకుం బంపిరి. వారన్నిచోట్ల జయించుకొని వచ్చిరి. విరటుని యాస్థానమందున్నమల్లునిపైతమోడించిరి. అత్తఱిఁ గంకుఁడు వలలునిచేఁ బోరింపుమని రాజున కుపదేశించెను. రాజు పనుపుపై వలలుఁడా జెట్టిగాండ్రతో బోరి వారి నవలీల నోడించెను. దీనింబట్టి పాండవులు ప్రచ్ఛన్న వేషులై విరటుని కొలువులో నున్నారని కౌరవులు గ్రహింపఁగల్గిరి.

మఱియు విరటుని బావయగు కీచకుఁడు ద్రౌపదిపై మోహము నిలిపి యామెను జెఱుప యత్నింపఁగా, వంటల వాని రూపముతో నున్న భీముడు వానినిజంపి, వాని తమ్ము లను గూడ నాశ మొందించెను.

యుద్ధసమయమున నర్జునుని తర్వాత భీమునే పాండవ పక్షమునఁ బేర్కొన వలయును. గదా యుద్ధమున నతఁడు నిరుపమాన ప్రజ్ఞగలవాఁడు. కురుకుమారులలో బెక్కండ్ర తని గదాఘాతములచేతనే కూలిరి. దుస్ససేనుఁడు ద్రౌపది వలువ లొలుచుతఱినిఁ దానొనర్చిన ప్రతిజ్ఞను నిల్పుకొని,

భీముఁడు వానిని ఘోరముగాఁ జంపి వాని నెత్తురు పూసి కొని, ప్రేవులు జందెములుగా వైచుకొని వినోదించెను. ఆ ప్రకారముగానే దుర్యోధనుని తొడలు విరుగఁగొట్టి చంపెను.

భీముఁడు గొప్ప శివపూజా ధురంధరుఁడు. అర్జునుఁడు తనకు వాసుదేవునియెడఁగల భక్తికి మిగుల గర్వపడుచుండు వాఁడు. కృష్ణుఁడది కనిపెట్టి యతనిగర్వభంజనము చేయఁ దలఁచి యొకనాఁడర్జునునింగొని కైలాసనగర ప్రాంతము నకుఁ దీసికొనివెళ్ళెను. అక్కడ నిర్మాల్యములగు మారేడు దళములు బండ్లమీఁద నెన్నియో ప్రమథగణములు గొని పోవుచుండుట వారు కాంచిరి. అర్జునుఁడిన్ని మారేడు దళము లెక్కడనుండి యెక్కడకుఁ గొంపోవుదురని ప్రమథుల నడుఁగగా వారవి భూలోకములో భీమసేనుఁడు శివునిఁ బూజించినవనియుఁ బ్రతి దినమున నిట్లు కొంపోవుచుందు మనియుఁ జెప్పగా, నర్జునుఁడాశ్చర్యపడి యన్న శివభక్తి కెంతయు సంతసించెను.

లోకములో నేఁటికిని గొప్ప బలవంతుని 'భీమబలుఁ' డని పిలుచుటకుఁ గారణ మా భారతవీరుని యప్రతిమాన భుజబలమే. అట్టి బలయుతులు సాధారణముగా శాంతస్వభా వులు కానేరరు. కాని యతఁడు శాంతగుణముకూఁడ గల మహనీయుఁడు.

# 9. అర్జునుఁడు

అర్జునుఁడు కుంతీదేవికి దేవేంద్రుని దివ్యానుగ్రహముచేఁ బుట్టిన సూనుఁడు. అతఁడు పూర్వజన్మమున నరుఁడను మునిపుంగవుఁడు. అస్త్రవిద్యలో నతని కతఁడేసాటి. అతనికుండు నేకాగ్రత మఱియెవ్వరికి లేదని ద్రోణుఁడు లెస్సఁగాఁ బరికించియే యతని కందఱికంటె నెక్కువ విద్య ప్రసాదించి యున్నాఁడు. నరునికింగల యేకాగ్రబుద్ధిఁ దెలుపునంశములు కొన్ని చూడుఁడు. కురుకుమారు లందఱును భోజనముజేయుచుండఁగా గాలిచే దీపమార్పఁబడెను. మఱల దీపము వెలిఁగించుదాఁకఁ గురుకుమారులెల్ల నూరక కూరుచుండిరి. అర్జునుఁ డట్లుచేయక, విస్తరిలో నేయేపదార్థ మెచ్చట నుంపఁబడినదో చక్కఁగాఁ గుర్తెఱింగినవాఁడు గావున భుజించుచునే యుండెను. దీనింగని ద్రోణుఁడు మిగుల సంతసించి యతఁడు చీఁకటిలో బాణము వేయగలనేర్పు పొందఁగలడని తలంచెను. మఱియొకనాఁడు కురుకుమారు లెల్ల వేఁట కేగిరి. వానితో ద్రోణుఁడుకూడనుండి యొక సమయమున వారియేకాగ్రత పరీక్షింపగోరి యిట్లనెను. "కుమారులారా! మీయెదుట నొకవృక్షముకలదు. దానిని బాగుగాఁ బరికించి చూచి యందు నాప్రేలికి సూటిగా నేమి కనఁబడుచున్నదో యొక్కరొక్కరె నాతోఁ జెప్పుడు." అప్పుడొక రాకులు, పువ్వులు మున్నగునవి కనఁబడుచు నున్నవనియు, మఱియొకఁడు యచ్చట పిట్టలు, కాయలు

పువ్వులు లోనగునవెల్ల జూపట్టుచున్నవనియుఁ జెప్పిరి. ఇటులే అందఱుగురుని వ్రేలికెదుటఁగాన్పించు వస్తుసంచయమంతయుఁ బేర్కొనుచు వచ్చిరి. అర్జునుని నడుగ నతని కొక్క కొంగమాత్రమే కనఁబడుచున్నదని చెప్పెను. ద్రోణుఁడు వ్రేల్చూపినది దానివంకనే. అర్జునుని బుద్ధి సూక్ష్మతకు గురుఁడు మిగుల మోదమందెను. అతని నస్త్ర విద్యయం దెవ్వరును మించువారు లేనట్లు విద్య నేర్పెద నని గురుఁడు వాగ్దాన మొనర్చెను. అటులే చేసెను.

ఏకలవ్యుఁడను బోయవాఁడు మట్టితో ద్రోణ విగ్రహముఁ జేసి స్వయంకృషిచే విలువిద్ద నేర్చుకొని మిగుల నైపుణ్యముం జూపఁగా, గురుఁడు దానిం గని, వాఁడర్జునుని మించిపోవునేమోయను భయముచేత వాని బొటనవ్రేలు కానుకగా బుచ్చుకొని, వానిని వ్యర్థవిక్రమునిగాఁ జేసెను. తనకంత శ్రద్ధతో గురుఁడు నేర్పిన విద్యలెల్ల గ్రహించి పార్థుఁ డత్యంత భక్తితో గురుని ఋణముం దీర్చుకొనఁగోరి యతఁడు కోరిన దక్షిణ యిచ్చెదనని పల్కెను. గురుఁడు తన విరోధి యగు ద్రుపదు నోడించి కట్టితీసికొనివచ్చి తనపాదములమీద బడవేయ వలయునని కోరెను. ఆపని మేమే చేసెదమని కురుకుమారు లందరును బయలుదేరిరి. కాని ద్రుపదుఁడు సామాన్యుఁడు కాఁడు. అతఁడు కౌరవుల నెల్ల నోడించి పాఱఁద్రోలెను. అప్పుడర్జునుఁడే యాపనిం బూని సాఁగెను. అస్త్ర విద్యా సంపూర్ణుఁడగు నర్జునుని ధాటికిఁ బాంచాల రాజోర్వలేక యోడిపోయెను. ఓడినవానిని గట్టితెచ్చి గురునకుఁ

పాదపూజగా నర్పించెను. అయ్యెడ గురుఁడొందిన సంతసమునకు మేరలేదు. ఓడిన ద్రుపదుఁ డోడించిన యర్జునుని పరాక్రమమును మెచ్చుకొనెనే కాని యతనిపై బగ పూనలేదు. పగకు ద్రోణుడే కారకుఁడని యాతనిం జంపుటకే యత్నములు సేయఁ జొచ్చెను. అర్జునుని వంటివాఁడు తన కల్లుఁడయిన బాగుగ నుండునని తలఁచెను. ఆయుద్దేశముతోనే యతఁడు తపమాచరించి ద్రోణునిఁ జయింపగల ధృష్టద్యుమ్నుఁడను కొడుకును, నరుని బెండ్లాడగల కృష్ణయను కూఁతును బడసెను.

ద్రౌపదీ స్వయంవరసమయమున నర్జునుని యస్త్రవిద్యాకుశలము లోకవిదిత మయ్యెను. స్వయంవరమునకు వచ్చిన రాజులలో నొక్కరును గొట్టఁజాలని మత్స్యయంత్రమును నర్జునుఁడవలీలఁ గొట్టియెల్లర కచ్చెరువుం గూర్చెను. అప్పుడతఁడు బ్రాహ్మణవేషముతో నుండుటచే ద్రుపదుఁడు గుర్తుపట్టలేక "అయ్యో! నాకోర్కె వ్యర్థమయ్యెఁగదా! అర్జునునికొర కుద్దేశింపబడిన నాకూఁతు నొక బాపనికిచ్చి వేయవలసి వచ్చెగదా" యని చింతించెను. కాని యావల నతఁడర్జునుఁడే యని తెలిసినప్పు డా రా జొందిన యానంద మింతింతని చెప్పఁజాలము.

తన మేనత్తకొడుకగు శ్రీకృష్ణునితో నర్జునున కా స్వయంవరకాలముననే పరిచయము కల్గినది. అదిమొదలు వారు విడకుండిరి. మత్స్యయంత్రమును గొట్టినవాఁడొక బ్రాహ్మణమాత్రుఁడు గాడని, యర్జునుఁడేయని తర్వాత

దెలిసి కౌరవులు కర్ణాదులతోఁగూడి, ద్రౌపదింగొని పోవుచు నర్జును నడ్డగించిరి. కాని వారాతని కోడి ముప్పతిప్పలంబడి పాఱిపోవలసి వచ్చెను. ఆ సమయమున నర్జునుఁడు చూపిన శౌర్య మత్యద్భుతమైనది.

ధర్మరాజుఁ డొనరింపఁబూనిన రాజసూయయాగము జయప్రదముగాఁ గొనసాగుటకుఁ గృష్ణునితోఁ బాటర్జునుఁడు కూడ ముఖ్యకారణుఁడని చెప్పవచ్చును. అతఁ డెందరినో జయించి వారిని సామంతభూపాలురనుగాఁ జేసి వారినుండి కప్పములం గొని తెచ్చి యన్నకిచ్చెను. యాగమునకై వ్యయింపఁబడిన ధనములో మూఁడువంతు లీతండు తెచ్చి యిచ్చినదే.

అర్జునుఁ డార్తత్రాణపరాయణుఁడు. ఒక బ్రాహ్మణుఁడు పులులచేఁ బీడింపఁబడి యర్జునుని శరణు వేఁడగా, నతఁడు శరణమిచ్చి బ్రోచెదననెను. కాని యప్పుడు చేతి నాయుధములు లేకపోవుటచేత నాయుధశాలకేఁగి వానిం గొనిదెత్తు ననెను. అతఁడందేగునప్పటి కందు ద్రౌపదీ ధర్మరాజులు లీలావిహారము సల్పుచుండిరి. ఆ సమయమున లోని కేగరాదు. పగిన, మున్నేర్పఱచికొన్న కట్టుబాటును బట్టి యర్జునుఁడు ద్వాదశమాసములు జటావల్కలములు ధరించి యిలు విడిచి తీర్థయాత్రలు సేవింపవలసి యుండును. అట్టి కఠిన వ్రతమునకు లోనగుటయా, శరణుజొచ్చిన విప్రునిం గాపాడుటయా యని యతఁడూహించి శరణాగత రక్షణమే యవశ్యకర్తవ్యమని నిర్ణయించి యాయుధా

గారములోనికిఁజని వలసిన యాయుధములం గొనెను. బ్రాహ్మణ రక్షణమైన తర్వాత నతం డన్నకడ సెలవుఁ గైకొని యిలువాసి తీర్థయాత్రలకుం జనెను.

ఆ ద్వాదశ మాసవ్రతంబు నెర వేర్పుపట్ల నతఁడొనరించిన పను లత్యద్భుతములు. ఆ యాత్రలలో నతఁడెన్ని దేశములకో యేఁగెను. ఎందఱు కన్నెలనో పెండ్లియాడెను. అతఁడమెరికాయని పిలువఁబడు పాతాళలోకమునకేఁగి యం దొక సుందరాంగి నుద్వాహమాడినట్లును మలయాళదేశము నకుఁజని యచటి పాలకురాలగు నొక తరుణిం బరిణయమైనట్లును దెలియవచ్చుచున్నది. ఆ వ్రతకాలములోనే యతఁడు యతిరూపుఁడై శ్రీకృష్ణు నింటికేగి సుభద్రను రాక్షసవిధిని గొనివచ్చి పెండ్లియాడెను.

ధర్మరాజు జూదమున రాజ్యసర్వస్వమోడితమ్ములతో నరణ్యమున కేగెను. అరణ్యాజ్ఞాతవాసములైనపిమ్మటనైనఁ గౌరవులు తమకు రాజ్యమిచ్చుట కల్లయని యర్జునుఁ డెఱింగి యన్న యనుమతిని నస్త్ర సంపాదనమునకై హిమవత్పర్వత ప్రాంతమునకుఁబోయి శివునిగూర్చి తపమాచరించెను. అతని తపస్సు మెచ్చి శివుఁడుప్రసన్నుఁడై యతని నించుకపరీక్షింపఁ దలఁచి తానుఁ గిరాతుఁడుగను, పార్వతికిరాతిగను రూపములను మార్చుకొని, మూకుఁడను రక్కసుని సూకరరూపము ధరింప నాజ్ఞ యిచ్చెను. మాయా కిరాతీ కిరాతులు పందిని దఱుముకొనివచ్చుచుండిరి. పంది, యర్జునుఁడు దపమాచరించు తావునకువచ్చి పరుగెత్తుచుండెను. కిరాతార్జును లొక్క

పర్యాయమే దానిని బాణముతోఁ గొట్టిరి. వరాహమును నదృశ్యమయ్యెను. అప్పుడాకిరాతార్జునులు పందిహక్కును గూర్చి వాదప్రతివాదము లొనర్చుకొని క్రమముగా ద్వంద్వ యుద్ధమునకు దిగిరి. కిరాతుఁ డర్జునుని వింటి నాక్రమించి శరములను మాయ మొనర్చెను. అట్లయినను, పార్థుఁడు ధైర్య పడక వట్టిచేతులతోఁ బోరాడఁదొడగెను. అతని పట్టుదలకు శివుఁడెంతయు సంతసించి నిజరూపముం ధరించి యతనికిఁ బాశుపతమను దివ్యాస్త్ర మొసంగెను.

ఆసమయమున దేవేంద్రునకుఁ గాలకేయాది రాక్షసులకును సమరము నడుచుచుండెను. ఆయుద్ధమునఁ దనకుఁ దోడ్పాటొసంగుమని కోరుచు నింద్రుఁడు కుమారుని యొద్దకు వచ్చెను. అర్జునుఁడందులకియ్యకొని జనకునితో స్వర్గమునకుఁ బోయి తన యప్రతిమానశౌర్యముం జూపి యా రక్కసి మూకల యుక్కడంచెను. అతని రూపరేఖలను గాంచి శౌర్య సంపత్తిని గూర్చి విని యూర్వశియను నప్సరస యర్జునుని మోహించి తన్ను భార్యగా స్వీకరింపుమని యాతని గోరెను. ఊర్వశి ఇంద్రుని యుంపుడుగత్తె. అదిగాక వేశ్యావృత్తి నున్న కులట. అట్టిదాని పొందునకై యర్జునుఁ డాసపడునా? అతఁడామె కోర్కె నిరాకరించెను. ఊర్వశికిఁ గోపమువచ్చి నపుంసకుఁడవు కమ్మని యతనిని శపించెను. ఇంద్రుఁడందుం గూర్చి విని, దుఃఖితుఁడై యున్న కొడుకుకడకువచ్చి యూర్వశిచే నతనిపైనున్న శాపమనుకూలఫక్కిని మఱలింపించెను. అదెట్లన, రాఁగల యజ్ఞాతవాస దీక్షలో నతని

కొకయేఁడాది షండత్వముండి యతఁడు స్త్రీలకు నాట్య గీతాదివిద్యల నేర్పుటకు వీలుజేసెను. తిన్నని దారింబోవు వారి కెన్నఁడాపదలు రావుగదా!

అతఁడు విరటుని కొలువులో బృహన్నలయను పేరుతో నుత్తరకు నాట్యవిద్య నేర్పుచుండ, కౌరవు లుత్తర దిక్కున నుండు గోవులను బట్టుటయు వానిని రక్షింప నుత్తరుఁడేగుచు సారథికొఱకై వెదకుచుండుటయువిని, తానర్జునుని సారథ ననియు సూతకృత్యము లెస్సఁగా నెఱవేర్పఁ గలననియుఁ జెప్పి యతని రథమునడుపుచుఁ గౌరవులుండుచోటికిఁ బోయెను. ఉత్తరుఁడు కురుసేనలఁజూచి భీతిల్లి పారిపోఁగా, నరుఁడు వానినదిమిపట్టి, తానర్జునుఁడనని నచ్చజెప్పి, కౌరవుల నెల్లర సమ్మోహనాస్త్రముచే మూర్ఛితులఁ గావించి, వారిలో నాయకుల తలకొక లుత్తరకు బొమ్మపొత్తికలకై తెచ్చి, గోవులను మఱలించుకొని వచ్చెను.

కురుక్షేత్ర యుద్ధారంభమున నర్జునుఁ డందఱు బంధువులను జంపుటకిష్టపడక సమరమునకు వెనుకంజ వేయఁగా నప్పుడు శ్రీకృష్ణుఁడు మహత్తరమైన వేదాంతో పన్యాసమిచ్చి వాని మనస్సు యుద్ధమువంకకుఁ ద్రిప్పెను. కొంచెమేనియు యుద్ధమున భీష్ముని ధాటికాగిన దతఁడే. భీష్ముఁడు చచ్చు మర్మమెఱిఁగిన తర్వాత శిఖండిని దన రథముపైఁ గూర్చుండబెట్టుకొని యర్జునుఁడే శరములు భీష్మునిపై విడిచెను. కాని యవి యతనిఁబడఁగొట్ట జాలకుండినఁ దానే శిఖండిచేయిపట్టుకొని యమ్ము లాకర్షించి

విడువఁజొచ్చెను. ఆ దెబ్బలకు శంతననందనుఁ డోర్వఁజాలక కూలెను. అప్పుడతఁడు తనమదికినచ్చు సెజ్జగావలె ననఁగా నర్జునుఁడే తన హస్తలాఘవ విశేషముచే బాణంపు బాన్పొకటి నిర్మించి యెక్కుపెట్టి బాణమే తలగడగ నమర్చి యిచ్చెను. భీష్ముఁడు పవిత్రోదకము దప్పిక దీర్చుకొనుటకై కావలయుననికోర, నర్జునుఁడే బాణపరంపరచేఁ బాతాళగంగ నాకర్షించి యది పాన్పుపైఁ భీష్ముని నోటికిఁ బడునట్లు ఏర్పాటుచేసెను.

సంశప్తకులనురాక్షసవ్యూహమువలన నుపద్రవము గలుగకుండ శ్రీకృష్ణునిదోడుచేసికొని యర్జునుఁడే వారిమీది కేఁగి యందఱిం దునుమాడివచ్చెను. వచ్చుసరికి బ్రియసుతుండగు నభిమన్యుని మరణవార్తవిని, చాలకోపించి యావల వాని చావునకు ముఖ్యకారణుండగు సైంధవుని మరునాటి సూర్యాస్తమయములోపలఁ జంపెద ననియుఁ జంపలేకున్నఁ దానే చిచ్చుఱికి ప్రాణమును బాయుదు ననియు ఘోరప్రతిజ్ఞ యొనరించెను. మఱునాటి యుద్ధరంగమున సైంధవుఁడు దుర్గమప్రదేశమున దాఁపబడియుండెను. వానికడకుఁ బోవలయునన్న, ముందు ద్రోణుని దాఁటి పోవలెను. ఆవలఁ గృపాశ్వత్థామలను, కర్ణశల్యులను, వృషసేన దుర్యోధనులనుం గ్రమముగా నతిక్రమించి పోవలెను. అర్జునుఁడు చాల మందిని ద్రోసికొనిపోయెను. అప్పటికెంతో ప్రొద్దులేదు. అర్జునుఁడు నిరుత్సాహఁ పడఁజొచ్చెను. కురుసేనలెల్ల నిఁక నర్జునుఁడు చిచ్చుఱకక తప్పదని యూహించి

యానందించుచుండెను. అప్పుడు భక్త సంరక్షకుఁడగు కృష్ణుఁడు చక్రముచే సకాల సంధ్య గల్పించి గౌరవులను భ్రమపెట్టి యశ్రద్ధగలవారినిగాఁ జేసెను. అదే సమయమున యర్జునుఁడు సైంధవుని తల యెచ్చటనో తపస్సు చేసికొను చుండు వాని తండ్రి చేతులలోఁ బడునట్లు కొట్టెను.

భీమసుయోధనులకు వలెనే కర్ణార్జునులకుఁ జిన్న నాఁటి నుండియు బరస్పరమాత్సర్యము గలిగి యుండెను. అస్త్రవిద్య ముగించిన తర్వాతఁ గురుకుమారుల కెల్లఁ బెద్ద లొకపరీక్షఁ బెట్టిరి. అందర్జునునికిఁ బ్రతియైనిల్చువాఁడే లేక పోఁగాఁ గర్ణుండొక్కఁడే లేచెను. కాని యతఁడు రాజు కాక పోవుటచేఁ బెద్దలంగీకరింపలేదు. నాఁటి నుండియు నొండొరులు పలుమాఱు విరోధించుచుఁ బోరుచు వచ్చిరి. కాని యర్జునుఁడే గెలుపొందుచుండెను. మహారణమునఁ గర్ణుఁ డెట్లైన నర్జునునిఁ జంపితీరునని కురురాజాసించుచుండెను. అర్జునుఁడే కర్ణునిఁ జంపునని ధర్మరాజాసించుచుండెను. ఒకనాఁడు ధర్మజునిఁ దీవ్రశరాఘాతముల నొప్పించెను. ధర్మరాజు యుద్ధము విడిచి శిబిరమునకుఁ బోయి పండుకొని యుండెను. అర్జునుఁడు కర్ణునిఁ దాకెను. కాని నాఁడతఁడు దుర్నిరీక్షుఁడై యుంటఁ దీవ్రముగా నెదిరింప లేకపోయెను. సాయంకాలమున కెల్లరును గుడారములను జేరుకొనిరి. అర్జునుఁ డన్నను జూడఁబోయెను. తమ్ముఁడు కర్ణునింజంపి వచ్చుచున్నాఁడని ధర్మజుఁడు తలఁచి సంతోషముతో "నాయనా! కర్ణుఁడు చచ్చెనా? ఎట్లు చచ్చెను? వివరించి చెప్పు" మని యడిగెను. అర్జునుఁడు "వాడింకను జావలేదు.

నేఁడు వాని నెదుర్ప నెవ్వరిదరమునుగాదు. రేపుచూత" మనెను. ఆ మాటలు విని యమనందనుఁడు కోపించి "ఓరీ! నీవిట్లు నిర్వీర్యుఁడవై యుండువని యెఱిఁగిన యుద్ధమున నుపక్రమింపకుందునే! నీ గాండీవ మేల? కాల్పనా? నీ యస్త్రవిద్యయంతయు మంటఁగలపనా?" యని నిందించెను. తన గాండీవమును నిందించినవారి తల నఱికెదనని యర్జునుని శపథము. కావున నతఁడుకడురోషించి యన్ననుఁ జంపఁ బూనెను. కృష్ణుఁడడ్డుకొని యుభయులకు సామరస్యము కుదిర్చెను. ఉభయులును బశ్చాత్తాపపడి దోషములం బోఁగొట్టు కొనిరి.

ఆమఱునాఁ డర్జునుఁడు తన శక్తినంతయు వినియోగించి కర్ణుని నెదుర్కొని మాధవుని సాహాయ్యసంపదచే వానిం దెగటార్చెను. కర్ణుఁడు నిరాయుధుఁడై రథచక్రము సవరించుకొను చుండఁగా నర్జునుఁడు కొట్టిచంపెనను నిందకు మాత్ర మర్జునుఁ డుత్తరవాదియై యున్నాఁడు. అది యక్రమ మనక తప్పదు. కాని రాజనీతియందది యొకగొప్ప లోపమనఁబడదు.

యుద్ధానంతరమున ధర్మరాజు వాజిమేధయాగ మొనర్పఁ దలపెట్టెను. అప్పుడుకూడ నర్జునుఁడే దానిని జయప్రదముగ సాగింపఁబూని యజ్ఞాశ్వమువెంటఁ దానే సేనలతో నేఁగి, యడ్డమువచ్చిన రాజులనెల్ల జయించి యన్నకు యశముం గూర్చెను.

అతనికి నర్జునుఁడు, ఫల్గునుఁడు, పార్థుఁడు, కిరీటి, శ్వేత వాహనుఁడు, భీభత్సుఁడు, విజయుఁడు, జిష్ణుఁడు,

సవ్యసాచి, ధనంజయుఁడు అను పేరులుగలవు. అవియన్నియు సార్థక నామములే కాని, నేతిబీర కాయవంటివి కావు. నేఁటికిని సమస్త హైందవులచే నాచరింపఁబడు "విజయదశమి" యను పండుగు, ఆ మహనీయుఁ డొనర్చిన దిగ్విజయ యాత్రా విషయమును స్ఫురణకుఁ దెచ్చుటకొఱకేయని యెఱుంగునది.

## 10. అభిమన్యుఁడు

అభిమన్యుఁడర్జునునకు సుభద్రయందుఁ బుట్టినకుమార రత్నము; భారత యుద్ధములోఁ బోరిన శూరావతంసులలో భీష్ముని తరువాతఁ జెప్పదగ్గ శూరశిఖామణి. "తేజోనిధికి వయసు కారణమగునే?" అను సుభాషితమీతని చరిత్రము వలననే బయలుదేఱిన దనవచ్చును. బ్రతికినది కొలఁది యేండ్లు మాత్రమే యైననుఁ నతఁ డజరామరమైన కీర్తి గడించినాఁడు. కావున నతనిచరితము పరమపూతము. అతఁడు భారతీయులకెల్ల నాదర్శ పురుషులలో నొకఁడు.

అభిమన్యుఁడు తల్లిగర్భమున నుండఁగనే యస్త్రవిద్య నభ్యసించెనందురు. ఏలయన, నొకనాఁడు ఫల్గుణుఁడు వినోదార్థము భార్యకు వ్యూహములు, వానిని భేదించి వచ్చుటలు మున్నగు నంశములు మనోహర ఫణితిని జెప్పుచుండెనట. ఆమె కొంతవఱకు విని యావల నిద్దుర రాఁగా, నామె కడుపులో నున్న యభిమన్యుఁడే యూఁకొట్ట నారంభించెనట. ఆవలి గదిలోనున్న కృష్ణుఁడది కని గర్భకోశములో నుండియే వాఁడన్నియు నేర్చిన, నిఁక నజేయుఁడై తాను వానిం గడ

తీర్చుటకు మఱొక యవతారముఁ దాల్చవలసి వచ్చునను భయముచేఁ బరిహాసలీల నర్జునునితో "బావా! ఆడువారితో వ్యూహోదంతము లేల?" యని పల్కెనట. అర్జునుఁడు సిగ్గుపడి మానెనట.

పాండవు లరణ్యావాసమున కేఁగ, నభిమన్యుఁడు తల్లితో బాటు మేనమామల యింటనేయుండి యచ్చటనే సమస్తశాస్త్రములును విలువిద్యయు నేర్చెను. అతఁడాటలలో గూడ కృష్ణుని సుతుల నవలీల నోర్చుచుఁ దన శౌర్యము చిన్నప్పటినుండియుఁ బ్రకటించుచుండెను. బలరాముని కూఁతురగు శశిరేఖకును నభిమన్యునకును జిన్నప్పటినుండియు బరస్పరప్రేమ కుదిరినది. ఒండొరులు వివాహమాడ నిచ్ఛగించుచుండిరి. కాని రాజ్యవిహీనులై యడవులంబట్టి యున్న పాండవులబిడ్డకుఁ దన సుతనీయ హలాయుధుఁడు సమ్మతింపక దుర్యోధనుని కొడుకగు లక్ష్మణునకీయ నిశ్చయించెను. సుభద్రా కృష్ణు లెన్ని చెప్పినను బలరాముఁడు వినఁడయ్యెను. సుభద్ర కన్నపైఁ గోపమువచ్చి తన సుతునితో నడవిదారిఁబట్టి పోవుచుండెను. దారిలో ఘటోత్కచుఁడు వారినడ్డుకొనెను. అప్పుడు ఘటోత్కచుఁడు తన పెదతండ్రి కొడుకని యెఱుఁగక యభిమన్యుఁడతనిం దలపడిపోరెను. ఉభయులును సమానబలులై యొండొరుల నొవ్వనేసికొన్నప్పుడు బిరుదులు పల్కుచుఁ దమ తండ్రులం దలపెట్టిరి. అప్పుడు వారి బాంధవ్యము తెలిసికొనఁగల్గిరి. ఘటోత్కచుఁడు తమ్మునాదరించి యతనికి వివాహముపట్ల జరిగిన యవమానమునకుఁ జింతించి పినతల్లినిఁ దమ్మునిదన

తల్లికడనుంచి తానతిశీఘ్రముగా ద్వారక కేఁగి యర్ధరాత్ర మున నిద్రించుచున్న శశిరేఖను గొనివచ్చి యరణ్యములో సమస్తభూతములే సదస్యులుగాఁ బక్షుల కిలకిలారవములే మంత్రోక్తులుగానుండఁ బెండిలి యొనర్చెను. తాను గాను రూపియగుట, శశిరేఖ వేషముధరించి ద్వారక కేఁగి యుయ్యెలలో నెప్పటిశశిరేఖయట్లు పండుకొనెను. మఱునాడులక్ష్మణకుమారునికిని మాయాశశిరేఖకును బెండ్లి జరుగుచుండెను. ఘటోత్కచుఁ డంతటికిని శశిరేఖవలెను, బెండ్లికుమారునకు మాత్రము వికారరూపిగను గన్పట్ట, నందేదో మర్మమున్నదని కౌరవులు భావించిరి. ఘటోత్కచుఁడు నిజరూపముం దాల్చి బెండ్లివారిలో విరోధులనెల్ల మర్దించి పాఱివచ్చెను.

యుద్ధములలో నర్జునునితీవ్రతఁజూచి కురురాజు ద్రోణునికి భీష్మ మరణానంతరమున సర్వసేనాధిపత్య మొసంగెను. ద్రోణుఁడందులకు సంతసించి కురురాజు నొకవరము కోరుమనెను. అతఁడు ధర్మరాజునుగట్టి తనకిమ్మని కోరెను. అర్జునుఁడు రణరంగమున లేకున్న, నటులే తెచ్చి యిత్తుననిద్రోణుడనెను. దుర్యోధనుఁడు మఱునాఁడర్జునుని సమరరంగమునుండి తప్పించుటకు సంశప్తకులను త్రిగర్తవాహినులఁ బ్రేరేపించెను. అర్జునుఁడు మహారణావనివిడిచి వారితోఁబోర నింకొకదెసకుఁ బోవకతీరదయ్యెను. నాఁడు ద్రోణుఁడు పద్మాకారముగాఁ దన సేనలఁ బన్నించియుండెను. దానిం జొరగలవాఁ డర్జునుఁ డొక్కఁడే. పాండవులందఱును తహతహ పడఁజొచ్చిరి. ద్రౌపది పద్మవ్యూహభేదనము మన యభిమన్యుఁ డెఱుఁగుననెను. కాని

యర్జునుఁడు తాను లేనప్పుడు కొడుకును యుద్ధమునకు బంప వలదని యన్నతో జెప్పియున్నాడు. ధర్మరాజున కేమియుఁ దోపక, దమ్ములచే నభిమన్యునిఁ బిలిపించెను.

"అభిమన్యుఁడు వ్యూహముంజొచ్చి లోని కేగు నేని, మేమతని ననుసరించి వెళ్ళెదము. అతని కిక్కట్టును రాకుండ గాపాడఁగలము. కావున నతనిం దమ్మిమొగ్గరముం జొర నాజ్ఞయిం"డని తమ్ములెల్ల ధర్మరాజుతో ననిరి. ధర్మరాజు సౌభద్రునితో "నాయనా ! నేఁడు ద్రోణుఁడు తమ్మిమొగ్గ రము పన్నియున్నాఁడు. అందుజొర మాకెవ్వరికిని దెలియదు. నీ వెఱుఁగుదువని విందును. కాని నిన్నుఁ జొరమనుటకు నోరాడకున్నది. ఏలయన: నీ తండ్రియు మామయు దగ్గర లేరు; ద్రోణునితోఁ బోరుసల్పక తప్పదు. నీభార్య గర్భవతి; నీవు తల్లి కేకపుత్రుఁడవు. నీవు నిరంకుశ ప్రజ్ఞ గలవాడఁవు; గావునఁ గార్యము నెఱవేర్తువనియు ధైర్యము గలదు. వారు పాపాత్ములు గాన నెట్టిసాహసమున కొడిగట్టుదురో యని వెఱపును గలుగుచున్నది" యని చెప్పెను. భీమాదు లును వానిని బద్మవ్యూహముం ప్రవేశింపఁ బరిపరి విధముల బ్రోత్సహించిరి. అభిమన్యుఁడు "తండ్రులారా ! మీరింతగా నన్నుఁ గోరవలయునా ? మీయాజ్ఞా బద్ధుఁడనై తప్పక వ్యూహము భేదింప నేగుదును. నాకు సెలవిం" డని ధర్మజా దులకు నమస్కరించెను. ధర్మరాజిట్లు లాశీర్వదించెను. "నాయనా ! పదిమంది యొకటై నిన్ను గవయుదురు గాక; నీక విజయంబు గల్గుఁగాత." ఆవాక్యము లక్ష్మీలార్థముం గూడ స్ఫురింపఁజేయుటచే, భీమాదులులికిపడి, "అమంగళా

మప్రతిహతమగుఁ గాక" యని లోలోనఁ దలఁచుచు బాల శూరునిం బురస్కరించుకొని సమరరంగంబున కేఁగిరి.

అభిమన్యుఁడు రథారోహణ మొనర్చి యుద్ధస్థలములో బ్రవేశించెను. ధర్మజుఁడు, తమ్ములారా! మీరు శత్రువాని వెనువెంట నేపోయి యతఁడు మొగ్గరముం జీల్చిన తోడనే యడ్డమువచ్చిన సేనల నెల్లఁ గూల్చి వానికెట్టి హానియుఁ గలుగకుండ గాపాడవలయును. వాని నెట్లో సురక్షితముగా సుభద్ర కొప్పింపవలయు" నని చెప్పెను. అభిమన్యుఁడు గొఱ్ఱెలమందలంబడిన క్రొవ్వులివలెఁ గౌరవ సేనలంజొచ్చి యెదిర్చిన వారి నెల్ల నొక్క యేటితో యమ సదనమునకుఁ బంపుచుఁ బద్మవ్యూహముంజొచ్చెను. ద్వాద శార్కులొక్కమ్మడి నుదయించిన తెఱంగున నభిమన్యుడు మహాతేజస్వియై వెలుంగుచుండెను. మొగ్గరముం జొచ్చిన తోడనే యతఁడు దుర్యోధనునితోఁ బోరుసల్పవలసివచ్చెను; కాని ద్రోణుఁడు రారాజు నా బాలవీరుఁ డెక్కడ నొప్పించునోయని భీతినిదానే యతనికి బాసటయైవచ్చి యభిమన్యు నెదుర్కొనెను. ద్రోణుని వెనుకఁ గర్ణాదులువచ్చి వానిపై బడిరి. కాని యా వీరావతార మెవ్వరికిని సరకుగొనక మహాసముద్రమునఁ దిమింగిలపుఁబిల్ల విహరించిన తెఱంగున విహరింపఁ జొచ్చెను.

అభిమన్యుఁడట్లు వీరవిహారము చేయుచుండ, నతని వెంట సాహాయ్యము నిమిత్తమనుసరించు భీమాదులను సైంధవుడరి కట్టెను. సైంధవునిజయించుటభీమునకొకకష్టకార్యముగాదు కాని నాఁడుమాత్ర మాజయద్రథుడు వరబలముగలవాఁడగు

టచే వాని నెదిరింప ఫాలాక్షునికైన శక్యముగాకుండెను. భీముఁడెంతసేపు పోరినను వానిని ద్రోసిపుచ్చ జాలకుండెను.

ఈలోన నభిమన్యుని శౌర్యప్రకటనమును జూచి కౌరవులెల్ల భీతిల్లసాగిరి. ద్రోణుఁడా బాలుని పరాక్రమమునకు మెచ్చుచు, "కౌరవసేనా నాయకులారా! మీరు బాలుఁడని సందేహింపవలదు. మీరందఱు నొక్కుమ్మడిం దాకినఁగాని యతనిం జయింపఁజాలరు." అని కేకవైచెను. అభిమన్యుఁడు కర్ణుని సుతుఁడగు వృషసేనుని మూర్ఛిలఁజేసెను. శల్యసుతుని మడియించెను. రారాజుకొడుకగు లక్ష్మణుండెదుర్కొన వాని నవలీల హతమొనర్చెను. కర్ణుడెదిరింప నతనిం దఱిమివైచెను. ఈ యద్భుత విహారముం గాంచియు, దుర్యోధనుఁడు కొడుకుకై శోకించుచుండుటఁ గనియు ద్రోణుఁడు మఱల యోధులనెల్ల నొక్కసారి యాబాలుని పైబడ బురికొల్పెను. అప్పుడొకఁడు వానిసారథింగూల్చెను. వేఱొకఁడు వానిరథమును నుగ్గుచేసెను. మఱియొకఁడు వానిచేతి యాయుధమును ఖండించెను. ఆయుధము పోయిన వేఱొక యాయుధ మందిచ్చుటకుఁగాని, రథము విఱిగిన మఱియొక రథమాయత్త పరచుటకుఁగాని, తనవారెవ్వరు సమీపమున లేరు. ఇఁక దనకెట్టులును జావుతప్పదని యావీర బాలకుఁడు నిశ్చయించుకొని గదచేబూని, తన్నెదుర్కొనిన వారినెల్ల [illegible]బిల్కు మార్చుచుండెను. కడపట దుశ్శాసనుని కొడుకు వానితో గదాయుద్ధమునకు డీకొనెను. ఎంత యలసి యున్నను సౌభద్రుఁడు దౌశ్శాసనికిఁ దీసిపోకయే పోర

జొచ్చెను. కాని యిరువురును దీవ్రఘాతములచే నొకరి నొకరు నొప్పించుటచేత నొక్కపర్యాయమే నేలఁగూలి ప్రాణములను వీడిరి.

ద్రోణుఁడు తలఁచిన తలంపు నెఱవేఱలేదు. విశేషించి పెక్కండ్రు శూరశిఖామణు లా బాలశూరునిచే జంపబడిరి. నాఁటి యభిమన్యునితోఁడి యుద్ధము ప్రతి కౌరవ వీరునకును మహాభయమును నిరుత్సాహమును గల్గించెను. వాఁడు మడియుటతోడనే వారికష్టము లన్నియు గట్టెక్కినట్లుండెను. కాని ధర్మరాజుమాత్రము తన రక్షణమునకై బాలుని బలియిచ్చితిని గదాయని యెంతయో దుఃఖించెను. అర్జునుఁడింటికివచ్చిన తర్వాతఁ బొందిన దుఃఖమునకు మేరయే లేదు. కాని యా దుఃఖమును గృష్ణుఁడు రోషముగా మార్చి మఱునాఁడు భీమునరికట్టిన జయద్రథుని నర్జునునిచేఁ జంపించెను.

కులనాశనము గావించిన నూర్వురు కొడుకులుండి యేమి ఫలము? అభిమన్యునివంటి మహాపరాక్రమశాలి యొక్కఁడుండిన జాలును. ఆవంశపుగీర్తి దిగంత విశ్రాంతమై చిరస్థాయియై నిలిచియుండును. ఆకాశమందెన్ని చుక్కలున్నను గాంతి గలుగనేరదు. ఒక్క చంద్రరేఖ యున్న జగమంతయుఁ బ్రకాశింపఁ జేయగలదు.

అభిమన్యునికి నుత్తరాగర్భమునఁ బుట్టినకొడుకే పరీక్షిత్తు. అతఁడే పాండవకౌరవవంశాంకురమై నిల్చెను.